www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి:02 సంచిక:52, మంగళవారం,12.12.2023

# 'రైతు బంధు'కు గ్రీన్‌సిగ్నల్

- రైతు భరోసాను ఈ దఫా రైతు బంధుగా అమలు
- నేటి నుంచే రైతుల ఖాతాల్లో నగదు జమ
- పాత పద్ధతిలోనే పంట పెట్టుబడి సాయం పంపిణీ
- రూ. 2లక్షల రుణమాఫీపై కార్యాచరణ రూపొందించండి
- వ్యవసాయ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం




**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

రైతు బంధు పంపిణీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు రైతు బంధు పథకం కింద చెల్లింపులు చేయాలని ఆర్థిక శాఖ అధికారులకు తెలిపారు. విధివిధానాలు ఖరారు కానందున గతంలో మాదిరిగానే రైతులకు చెల్లింపులు చేయాలని అధికారులను ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలకు ముందే... ఎన్నికల ముందే రైతు బంధు పథకం కింద నిధులు విడుదల కావాల్సి ఉంది. అయితే నోటిఫికేషన్ విడుదల కావడం, అప్పట్లో హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలు కారణంగా రైతు బంధు పథకం కింద నిధులు నిలిచిపోయాయి. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు పథకాన్ని కొనసాగిస్తామని, ఎక్కువగా నిధులు ఇస్తామని చెప్పింది. అయితే విధివిధానాలు ఖరారు కాకపోవడంతో పాత పద్ధతిలోనే నిధులు విడుదల కానున్నాయి. సోమవారం వ్యవసాయ శాఖ పై సీఎం డా.బీఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్‌శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామ కృష్ణా రావు, సీఎంవో కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు. దాదాపు మూడు గంటల పాటుజరిగిన ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో వ్యవసాయ శాఖ, సంబంధిత విభాగాల పనితీరు, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, రైతులకు నేటి నుంచే రైతు బంధు నిధులను సంబంధిత రైతుల ఖాతాల్లో వేసే ప్రక్రిను ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కలుగకుండా పంట పెట్టుబడి సాయం అందించాలని అన్నారు.

**ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో ప్రజావాణి నిర్వహణ**

ప్రస్తుతం జ్యోతి రావు పూలే ప్రజాభవన్ లో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ ను ఇక నుంచి ప్రజావాణిగా పిలవాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రజావాణి ని ఇక నుంచి ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో రెండు రోజులు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వంటి గంట వరకు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ ప్రజావాణికి ఉదయం 10 గంటల లోపు జ్యోతి రావు పూలే ప్రజా భవన్ కు చేరుకున్న వారికి అవకాశం ఇవ్వాలని సూచించారు. దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, ప్రజల సౌకర్యార్థం తీగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన రిజల్ట్ కచ్చితంగా ఉండాలి సీఎం రేవంత్ రెడ్డి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన మార్క్ పాలనతో దూకుడు

..మిగతా 2 లో

**రూ. 2 లక్షల రుణ మాఫీపై కార్యాచరణ రూపొందించాలి**

తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రం లోని రైతులకు రెండు లక్షల మేరకు రుణ మాఫీ చేసేందుకై తగు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.





# కేసీఆర్ త్వరగా కోలుకోవాలి మళ్లీ ప్రజా క్షేత్రంలోకి రావాలి

- టీడీపీ అధినేత చంద్రబాబు
- బీఆర్ఎస్ అధినేతకు పరామర్శ

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించారు. సోమవారం సోమాజిగూడ యశోద ఆసుపత్రికి వెళ్లిన చంద్రబాబు అక్కడ చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రజా జీవితంలోకి రావాలని, అంకిత భావంతో ప్రజలకు సేవ చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. చంద్రబాబు వెంట పలువురు మంత్రి సీతక్కతో పాటు టీడీపీ నాయకులు, నేతలు ఉన్నారు. ఆ తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి. హనుంతరావు వెళ్లి కేసీఆర్ ఆరోగ్యపై వాకబు చేశారు. వారందరినీ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దగ్గరుండి కేసీఆర్ వద్దకు తీసుకెళ్లారు. టాలీవుడ్ అగ్ర నటుడు చిరంజీవి కూడా కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. అలాగే భీమ్ ఆర్మీ చీఫ్ చంద్ర శేఖర్ ఆజాద్, బీఎస్పీ తెలంగాణ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, సినీ నటుడు ప్రకాశ్ రాజ్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మోత్కుపల్లి, చల్మడ లక్ష్మి నరసింహారావు తదితరులు కూడా కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

# టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవికి జనార్ధన్‌రెడ్డి రాజీనామా

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



టీఎస్‌పీఎస్సీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పదవికి జనార్ధన్‌రెడ్డి సోమవారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి అందజేశారు. ఆయన రాజీనామాను ఆమోదించిన గవర్నర్ సీఎస్‌కు పంపారు. ఉద్యోగాల భర్తీపై సోమవారం సీఎం రివ్యూ నిర్వహించారు. ఖాళీల భర్తీకి సంబంధించిన పూర్తి వివరాలను తీసుకోని రివ్యూ మీటింగ్‌కు హాజరుకావాలని జనార్దన్ రెడ్డిని సీఎంవో ఆదేశించింది. ఈ క్రమంలో ఆయన సీఎంతో భేటీ అయ్యారు. బోర్డుకు సంబంధించిన వివిధ అంశాలపై ఇరువురు చర్చించారు. గత ఏడాదిన్నరగా టీఎస్‌పీఎస్సీలో పేపర్ల లీక్‌లు, ఆపై పరీక్షల వాయిదాల వ్యవహారంతో ప్రతిష్టంభన కొనసాగుతున్న విషయం తెలిసిందే. రాజీనామాకు ముందు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. తదుపరి చర్యలు చేపట్టాలని సీఎస్‌కు గవర్నర్ లేఖ రాశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా జనార్దన్‌రెడ్డిని 2021లో అప్పటి ప్రభుత్వం నియమించింది. జనార్దన్‌రెడ్డి 1996కు చెందిన ఐపీఎస్

..మిగతా 2 లో



# ఎంపీ పదవికి కోమటిరెడ్డి రిజైన్

- రహదారుల దుస్థితిని మార్చేస్తా
- రాష్ట్రానికి నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తా
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. తెలంగాణలోని 14 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని.. అందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారని.. అందుకోసం ప్రభుత్వం తరపున కోమటిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు.

"గత ఐదేళ్లుగా రాష్ట్రంలో రాష్ట్ర రహదారుల స్థితిని నేను చూస్తూ వచ్చాను. కొన్ని చోట్ల రహదారులపై గుంతలు ఏర్పడితే మట్టితో నింపేశారు. గుంతలు ఏర్పడితే సిమెంట్, లేదా బీటీ ప్యాచ్‌లు వేసి గుంతలను పూడ్చాల్సి ఉంటుంది. నేను మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ముందుగా అధికారులకు ఆదేశాలు ఇచ్చాను. రహదారులపై ఎక్కడ గుంతలున్నా.. వాటిని వెంటనే మరమ్మతు చేయాలని చెప్పా. రాష్ట్ర రహదారుల విషయంలో ఏపీతో పోల్చితే తెంగాణకు కేంద్రం నుంచి తక్కువ నిధులు వచ్చాయి. ఇప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వంతో తరచూ సంప్రదింపులు చేస్తూ రాష్ట్రానికి ఎక్కువ నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తాం.కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటిని మొదలుపెట్టాం. మిగిలినవి కూడా అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. డిసెంబర్ 28న.. కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం రోజున మరికొన్ని గ్యారంటీలను మొదలు పెడతాం. ఇలా 100 రోజుల్లోగా అన్ని గ్యారంటీలను అమల్లోకి తీసుకొచ్చి.. తెలంగాణలో ప్రజా పాలన కొనసాగిస్తాం" అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు

# ఆర్టికల్ 370 రద్దు సమర్ధనీయమే

- కొత్త ప్రభుత్వం ఇక్కడ నెట్టుకు రావడం కష్టమే
- ఈ తీర్పుపై అనేక అంశాలు
- జముకశ్మీర్ భారత్ అంతర్గమమే
- సుప్రీం కీలక నిర్ణయం



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం (డిసెంబర్ 11న) కీలక తీర్పు ఇచ్చింది. ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమే అని సుప్రీంకోర్టు చెప్పింది. జమ్మూకశ్మీర్ అంశంలో రాష్ట్రపతి ప్రకటనపై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ అంశంపై పిటిషనర్ల వాదనను తోసిపుచ్చిన రాజ్యాంగ ధర్మాసనం.. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది.

జమ్మూకశ్మీర్‌పై కేంద్రం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని సవాల్ చేయలేరని అభిప్రాయపడింది. భారత్‌లో విలీనం తర్వాత జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమాధికారం లేదని, అప్పట్లో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా ఆర్టికల్ 370ని ప్రవేశపెట్టారని చెప్పింది. అది తాత్కాలిక ఏర్పాటు మాత్రమే గానీ.. శాశ్వతం కాదంది. దాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది.. హక్కుల విషయంలో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేకత ఏమీ లేదు..మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో అది సమానమే.. ఆర్టికల్ 1, ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ తీర్పును చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుపై కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకించలేమని

..మిగతా 2 లో



# జైవీర్‌కి పదవి కావాలని అడగలేదు

- కొత్త ప్రభుత్వానికి అందరూ సహకరించాలి
- రేవంత్‌ప్రజాభిమానం సంపాదించాలి
- కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి
- ప్రభుత్వంలో తనకు ఎలాంటి పోస్టు వద్దు
- జానా రెడ్డి ఇంటికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి

..మిగతా 2 లో

## మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్

- ఉత్కంఠకు తెరదించిన అధిష్ఠానం
- ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు కీలక పదవి
- ఓబీసీ వర్గం నేతకు సీఎం పోస్ట్



# కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తాం



- పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేస్తాం
- ఎస్ ఎల్‌బీసీ పూర్తి చేయడంపై కేబినెట్‌లో చర్చిస్తాం
- ప్రజల డబ్బులతో జరిగే పనుల్లో గోప్యత ఉండదు
- పూర్తి వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించా
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

కాళేశ్వరం ప్రాజెక్ట్ పై విచారణకు ఆదేశిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం జలసౌధలో కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టు తదితర ప్రాజెక్టు లపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన పూర్తి వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. నీటివాటాల అంశంపై కేంద్రంతో చర్చిస్తామన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఈ శాఖపై మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలను ఈఎన్‌సీ మురళీధర్‌రావు వివరించారు. మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.4600 కోట్లు ఖర్చు చేశామని, ఒక పిల్లర్ 1.2 మీటర్లు కుంగిపోయిందని ఇంజినీర్లు తెలిపారు. దీంతో మరో మూడు పిల్లర్లపై ఆ ప్రభావం పడిందని వారు చెప్పారు. ఇలా మొత్తం నాలుగు పిల్లర్లపై ఆ ప్రభావం పడిందన్నారు. పిల్లర్లు కింగిన ముందు రోజు వెంటనే ప్రాజెక్టులోని నీటిని తీసేయమని చెప్పారు. ఇలా చేయడం వల్ల కుంగడం తగ్గిందన్నారు. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు లను పూర్తి చేస్తామని ప్రకటించారు. 40వేల చెరువుల నిర్వహణ గురించి మా ప్రభుత్వం శ్రద్ధ వస్తుందన్నారు. అన్ని ఆరోపణలపై విచారణ చేస్తామన్నారు. ప్రజల డబ్బుతో జరిగే పనుల్లో ఎలాంటి గోప్యత ఉండదన్నారు. ప్రాజెక్ట్‌లన్నింటి పూర్తి వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించానన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో నీటిపారుదల శాఖది కీలక పాత్ర అని అన్నారు.

ప్రాజెక్ట్‌ల నిర్మాణంలో ఎవ్వరు డిజైన్ చేశారో, ఎవ్వరు నిర్మాణం చేశారో వారందరినీ బాధ్యులను చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే నిర్మించిన కొత్త ప్రాజెక్ట్ లు, కొత్తగా

..మిగతా 2 లో

# ఆర్టికల్ 370 రద్దు సమర్థనీయమే

**మొదటిపేజీ తరువాయి.**

జమ్మూకాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం అన్నారు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్. ఆర్టికల్ 370పై రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వులు చెల్లుబాటు అవుతాయని.. ఇది కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అని తన తీర్పులో వ్యాఖ్యానించారు చీఫ్ జస్టిస్. కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని.. ఆదేశాలను సవాల్ చేయలేమని.. దేశ భద్రత విషయంలో ఇది కీలకం అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు చీఫ్ జస్టిస్. భారత రాజ్యాంగం అనేది ఫైనల్ అని.. జమ్మూకాశ్మీర్ లో భారత్ లో అంతర్భాగం అయినప్పుడు ప్రత్యేక చట్టాలపై సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం వ్యక్తం చేశారు సీజేఐ.

జమ్మూకశ్మీర్ నుంచి లడ్డాఖ్ విభజించి దాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడాన్ని కూడా సుప్రీం కోర్టు సమర్థించింది. అయితే, ప్రస్తుతం కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న జమ్మూకశ్మీర్‌లో రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2024 సెప్టెంబరు 30వ తేదీలోగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని ఆదేశించింది.

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే 370 ఆర్టికల్‌ను కేంద్రం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జమ్మూకశ్మీర్‌కు చెందిన పలు పార్టీలు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వాటిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ ఏడాది ఆగస్టు 2 నుంచి సుదీర్ఘంగా విచారణ జరిపింది. సెప్టెంబరు 5న తన తీర్పును రిజర్వులో ఉంచింది. తాజాగా సోమవారం (డిసెంబర్ 11న) ఆ తీర్పును వెలువరించింది.

# ‘రైతు బంధు’కు గ్రీన్‌సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి.**

చూపిస్తున్నారు. పలు శాఖలపై అధికారులతో సమీక్షలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. తెలంగాణలో ఇటీవల కాలంలో డ్రగ్స్ కల్చర్ బాగా పెరగిపోయింది. ఈ క్రమంలో డ్రగ్స్ నిర్మూలనపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా డిసెంబర్ 11వ తేదీ సోమవారం సచివాలయంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులతో రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడిపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాంటీ నార్కోటిక్ బ్యూరో విభాగాన్ని బలోపేతం చేయాలని.. యాంటీ నార్కోటిక్ బ్యూరోకు పూర్తి స్థాయి డైరెక్టర్‌ను నియమించడంతోపాటు అవసరమైన నిధులు, వనరులు సమకూర్చాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన రిజల్ట్ కచ్చితంగా ఉండాలని అధికారులకు సీఎం చెప్పారు. డ్రగ్స్ రావాణా పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని.. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగించినా.. విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సంబంధిత అధికారులతోపాటు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తాం

**మొదటిపేజీ తరువాయి.**

వచ్చిన ఆయకట్టు వివరాలన్నీ ఇవ్వాలని అధికారులను ఆదేశించానని మంత్రి తెలిపారు. ప్రాజెక్ట్‌ల నిర్మాణం, నిర్వహణ అంతా కోట్లాది ప్రజల విశ్వాసంతో ముడిపడి ఉన్న అంశమని ఇదంతా పారదర్శకంగా ఉంటుందన్నారు. ప్రాజెక్టులకు అవుతున్న విద్యుత్ వినియోగంపై మంత్రి అధికారులను ప్రత్యేకంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుమ్మడి హట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మాణం గురించి ముఖ్యమంత్రి తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ ఎల్ బి సి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసేందుకు ఎంత అవసరమో ఖర్చు చేసేందుకు ముఖ్యమంత్రి తో చర్చించి, మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. నీటి పారుదల శాఖలో పనులు అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రజల డబ్బులతో మనం ప్రాజెక్టులను కడుతున్నామని, మనం పూర్తిగా బాధ్యత యుతంగా, జవాబుదారి తనంతో పని చేయాలన్నారు. తెలంగాణ లో నీటి పారుదల రంగానికి చాలా ప్రాధాన్యత ఉందని, దీన్ని గుర్తు పెట్టుకొని మనం పని చేయాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులకు హితబోధ చేశారు. నీటి పారుదల పనులలో మూడో పార్టీ చెక్ ఉండాన్నారు. ప్రజల్లో నీటి పారుదల రంగంపై ఉన్న అపోహాలు తొలగిపోయేలా పని చేయాలని అధికారులను ఆయన కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఈఎన్సీ మురళీధర్ తో పాటు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

# టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవికి జనార్ధన్‌రెడ్డి రాజీనామా


**మొదటిపేజీ తరువాయి.**

అధికారి. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో పలు కీలక పోస్టుల్లో పని చేశారు. ఆయన స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దాయపల్లి. అగ్రికల్చర్ పీజీ చేశారు. 1990లో గ్రూప్ 1కు ఎంపికై డిప్యూటీ కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి ఏపీలో నల్లగొండ, నెల్లూరు ఆర్డీవోగా సేవలందించారు. వరంగల్, అనంతపురం జిల్లాల కలెక్టర్‌గా విధులు పని చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, మార్కెటింగ్ శాఖల కమిషనర్‌గా, సహకారశాఖ రిజిస్ట్రార్‌గా, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా, విద్యాశాఖ కార్యదర్శిగా, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. 2021 మేలో అప్పటి ప్రభుత్వం ఆయనను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది.

# మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎవరు? గత రెండు వారాల నుంచి కొనసాగుతున్న ఈ సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. ఈ విషయంపై ఇన్ని రోజులు మౌనం పాటించిన బీజేపీ.. ఎట్టకేలకు ఆ రాష్ట్రపు సీఎం పగ్గాలను మోహన్ యాదవ్‌కు అప్పగించారు. ఇప్పటివరకూ శివరాజ్ సింగ్ చౌహాన్ తాత్కాలిక సీఎంగా కొనసాగగా.. ఇకపై మోహన్ ఆ బాధ్యతల్ని చేపట్టనున్నారు. 2023 మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఉజ్జయిని సౌత్ నుండి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన.. శివరాజ్ సింగ్ ప్రభుత్వంలో ఉన్నత విద్యామంత్రిగా ఉన్నారు. ఓబీసీ వర్గానికి చెందిన ఆయన పేరుని ముఖ్యమంత్రిగా బీజేపీ ఎమ్మెల్యేల సమావేశంలో ఆమోదించారు.



**ఎవరీ మోహన్ యాదవ్?**

1965 మార్చి 25వ తేదీన ఉజ్జయినిలో మోహన్ యాదవ్ జన్మించారు. ఆయన B.Sc, LLB, రాజకీయ శాస్త్రంలో MA, MBA, PhD వంటి ఉన్నత విద్యల్ని అభ్యసించారు. ఏబీవీపీతో అనుబంధం కలిగి ఉన్న మోహన్.. 1982లో మాధవ్ సైన్స్ కళాశాల విద్యార్థి సంఘానికి సహ కార్యదర్శిగా ఉన్నారు. అనంతరం 1984లో దాని అధ్యక్షుడిగా అవతరించారు. అదే ఏడాదిలో ఏబీవీపీ ఉజ్జయిని నగర మంత్రిగా, 1986లో శాఖాధిపతిగా ఎన్నికయ్యారు. 1988లో మధ్యప్రదేశ్ ఏబీవీపీ రాష్ట్ర సహకార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 198990లో ఏబీవీపీ రాష్ట్ర శాఖకు రాష్ట్ర మంత్రిగా, 199192లో మండలి జాతీయ మంత్రిగా వ్యవహరించారు. అనంతరం 199395 వరకు మోహన్ ఉజ్జయిని నగరంలో RSS సహవిభాగ కార్యదర్శిగా.. 1997లో భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా.. 1998లో పశ్చిమ రైల్వే బోర్డు సలహా కమిటీ సభ్యునిగా బాధ్యతల్ని నిర్వర్తించారు. 20002003 మధ్యకాలంలో ఉజ్జయిని విక్రమ్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా, బీజేపీ నగర జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేసిన ఆయన.. 2004లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 20042010 మధ్య కాలంలో ఉజ్జయిని డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఉన్నారు. ఆ తర్వాత ఆయనకు రాష్ట్ర మంత్రి హోదా ఇచ్చారు. 20112013 మధ్య కాలంలో BJP రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. 2013లో ఉజ్జయిని సౌత్ స్థానం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018 మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లోనూ ప్రజలు మరోసారి ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపించారు. 2020 జులై 2వ తేదీన శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా, ఉన్నత విద్యా శాఖ మంత్రిగా బాధ్యతల్ని స్వీకరించారు. ఇదిలావుండగా.. మధ్యప్రదేశ్‌లో ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉండనున్నారు. జగ్దీర్ దేవరా, రాజేంద్ర శుక్లాలను డిప్యూటీ సీఎంలుగా ఎంపిక చేయనున్నట్టు తెలిసింది. ఇక నరేంద్ర సింగ్ తోమర్ స్పీకర్‌గా వ్యవహరిస్తారు.

# డిసెంబర్ ఆఖరిలో రైతుబంధు 100 శాతం ఇస్తాం

- బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి రాగానే రైతుబంధు ఎప్పుడు ఇస్తారని అడగడం సరికాదు
- 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రైతుకు పెట్టుబడి 100 శాతం ఇస్తామని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గత ప్రభుత్వం డిసెంబర్ ఆఖరిలో ఇచ్చేదని, తాము కూడా అలాగే ఇస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి రాగానే రైతుబంధు ఎప్పుడు ఇస్తారని మాజీ మంత్రులు ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా గజ్వేల్కు వచ్చిన పొన్నం ప్రభాకర్కు డీసీసీ అధ్యక్షుడు గజ్వేల్ మాజీ



ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన గజ్వేల్లో మాట్లాడారు. ఈ నెల 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వస్తే, 9న 6 గ్యారంటీలలో 2 గ్యారంటీలను ప్రారంభించామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రవాణా శాఖ పరిధిలో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచామన్నారు. ఇచ్చిన ప్రకారం 6 గ్యారంటీలను 100 రోజుల్లో ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వాన్ని నడవనీయమని ప్రతిపక్షాలు అంటున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఇచ్చిన విధంగానే రైతుబంధు ఇస్తామని, కేసీఆర్ గజ్వేల్ నుంచి గెలిచాక ఒక్కసారైనా ఇక్కడి ప్రజలను కలవలేదని మంత్రి పొన్నం మండిపడ్డారు. ప్రగతిభవనాన్ని ప్రజాభవన్గా మార్చామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అక్కడ తెలుసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య పాలనను అందిస్తామని, భూ నిర్వాసితులతో కూలంకషంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతుబంధులోని లోపాలను సవరించి వీలైనంత త్వరలో రైతు బంధు నగదు అందిస్తామని పొన్నం ప్రభాకర్ వివరించారు.



# కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

- జనవరి 7న స్వామి వారి బ్రహ్మోత్సవాలు
- బీఆర్ఎస్ పాలనలో మల్లన్న క్షేత్రం అన్ని రంగాల్లో అభివృద్ధి
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో మల్లన్న క్షేత్రాన్ని, జనగామ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, స్వామి కృపతో తాను అద్భుత విజయం సాధించానని జనగమా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం మొదటిసారిగా సోమవారం ఆయన కొమురవెల్లి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జనవరి 7న జరిగే కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని, స్వామి వారి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. అలాగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, వసతుల పై త్వరలో ఆలయవర్గాలతో పాటు ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ సర్కారు పాలనలో కొమురవెల్లి మల్లన్న క్షేత్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. క్షేత్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనుల పై త్వరలో సమీక్ష జరిగి వాటిని సకాలంలో పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటునాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తలారీ కీర్తన, జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్లు మేక సంతోష్, గీస భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, సర్పంచ్ సార్ల లత తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం సరికాదు

- శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ధ్వంసం చేయడం బాధాకరమని కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ విప్ గువ్వల బాలరాజు తదితర నేతలతో కలిసి అయన మీడియా సమావేశంలో మాట్లాడారు. హనుమకొండ, అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల శిలాఫలకాలను, ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం ప్రగతి భవన్‌లో ఉన్న శిలాఫలకంపై కేసీఆర్ పేరును మట్టితో చెరిపివేయడం వంటి దుశ్చర్యలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్పడ్డారని అగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఇలాంటి చర్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కావన్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిపై కేసులను నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల చేత ధ్వంసమైన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల శిలాఫలకాలను తిరిగి పునరుద్ధరించాలని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నాలుగు రోజులు మాత్రమే అవుతున్నదని అలాంటప్పుడు వారిపై విమర్శలు చేయడం తమ ఉద్దేశం కాదన్నారు.

# జైవీర్‌కి పదవి కావాలని అడగలేదు

- కొత్త ప్రభుత్వానికి అందరూ సహకరించాలి
- రేవంత్‌ప్రజాభిమానం సంపాదించాలి
- కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి
- ప్రభుత్వంలో తనకు ఎలాంటి పోస్టు వద్దు
- జానా రెడ్డి ఇంటికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

‘నా కుమారుడు, నాగార్జునసాగర్‌ఎమ్మెల్యే జైవీర్‌కు మంత్రి పదవి కావాలని సీఎం రేవంత్‌రెడ్డిని అడగలేదని కాంగ్రెస్‌సీనియర్‌నేత కె. జానారెడ్డి అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ నేతలు వేం నరేందర్‌రెడ్డి, రోహిణ్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌జూబ్లీహిల్స్‌లోని జానారెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. తన నివాసానికి వచ్చిన రేవంత్‌రెడ్డికి జానారెడ్డి దంపతులు స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో ఆయనను సత్కరించారు. ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టాక ఆయన కాంగ్రెస్ సీనియర్ నేతలను మర్యాదపూర్వకంగా కలుస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా జానారెడ్డితో సమావేశమై ఎన్నికల ఫలితాలు, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, అమలు తీరు లాంటి అంశాలపై చర్చలు జరిపారు. రేవంత్ రెడ్డి సమావేశం అనంతరం జానా రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి అందరూ సహకరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులు, నాయకులు ఐకమత్యంగా కలిసి పని చేయాలని సూచించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజాభిమానం సొంతం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించానని తెలిపారు. కేసీఆర్‌కు గాయం కావడం చాలా బాధాకరమని, యశోద హాస్పిటల్‌లో ఆయనను పరామర్శించడానికి వెళ్లానని చెప్పారు. కేసీఆర్ సాధ్యమైనంత త్వరగా కోలుకుని శాసనసభకు రావాలని, ప్రతిపక్ష నాయకుడిగా ఆయన సలహాలు సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. ‘కాంగ్రెస్ పార్టీలో 15 ఏండ్లుగా మంత్రిగా ఉన్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను అన్ని రకాల మంత్రి పదవులు నిర్వర్తించానని జానారెడ్డి చెప్పారు. ‘కానీ తనకు ఇప్పుడు ఏ మంత్రి పదవి అవసరం లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆలోచిస్తాను. నా కుమారుడు జైవీర్‌కు పదవి ఇవ్వాలని అడగలేదు. ప్రస్తుతం అతడు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇంకా జూనియర్ మాత్రమే’ అని జానారెడ్డి అన్నారు.

# కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మరు

- కేసీఆర్ పట్ల ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదు
- జీహెచ్‌ఎంసీ పరిధిలో కేటీఆర్ పనితీరుకు ఓట్లు పడ్డాయి
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**విశాలభారతి,నల్గొండ :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పట్ల ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని, ప్రేమ, విశ్వాసం అలాగే ఉన్నాయని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు నమ్మి ప్రజలు ఓట్లు వేశారని అనుకోవడం లేదని చెప్పారు. కేసీఆర్ రావాలిమా ఎమ్మెల్యేలు పోవాలని ఓటర్లు అనుకున్నట్లు ఉందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కేటీఆర్ పనితీరుకు ఓట్లు పడ్డాయని తెలిపారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతుందన్నారు. పార్టీ మారాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన శాసన మండలి చైర్మన్ పదవీలో ఉన్నానని, తనకు ఏ పార్టీతో సంబంధం లేదని చెప్పారు. చట్టబద్ధంగా కర్తవ్యాన్ని నిర్వహిస్తానని, ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం ఉందని తెలిపారు. ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కూడా సాధ్య అసాధ్యలను బేరీజు వేసుకోవాలని సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితి వివరించి పథకాలు అమలు చేయాలని, వాస్తవాలు చెబితే ప్రజలు తప్పకుండా అర్థం చేసుకుంటారిన చెప్పారు. బీఆర్ఎస్ అధిష్టానం కూడా ప్రజలు తమకు వ్యతిరేకంగా తీర్పు ఎందుకిచ్చారని విశ్లేషన చేసుకుంటున్నదని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని, అధికారం ఎవరికీ శాశ్వతంగా ఉండదని వెల్లడించారు.

మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలను పేపర్లలో చూశానని, విమర్శలకు, ప్రతి విమర్శలకు ఇప్పుడు సమయం కాదన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేస్తూ, పక్కా కార్యాచరణతో వాళ్ళు పనిచేసుకుంటు వెళ్లాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రెండు మంత్రి పదవులు రావడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇద్దరు మంత్రులు జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లాలో ఇరిగేషన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాటిపై దృష్టిపెట్టాలన్నారు. జిల్లాలో రహదారుల అభివృద్ధికి మంత్రి వెంకట్ రెడ్డి పని చేస్తారనే నమ్మకం ఉందని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా బయటకు రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాని తెలిపారు.

# రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

- శిసంస్థాన్ నారాయణపురం యూత్ లీడర్ పగిళ్ల శేఖర్

**విశాల భారతి, సంస్థాన్‌నారాయణపురం:**

మునుగోడు నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సంస్థాన్‌నారాయణపురం మండల యూత్ లీడర్ పగిళ్ల శేఖర్‌డిమాండ్‌చేశారు. మునుగోడు నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించి చరిత్రాత్మక తీర్పునిచ్చారని అన్నారు. రాజగోపాల్ రెడ్డి మునుగోడు నియోజకవర్గంలోనే కాదు తెలంగాణ రాష్ట్రంలోనే ఎవరికి ఆపద వచ్చిన ఆదుకునే మంచి నాయకుడని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడంలో ప్రముఖ పాత్ర పోషించిన రాజగోపాల్ రెడ్డిని మంత్రివర్గంలో తీసుకోవాలని శేఖర్‌డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గ



అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి తప్పకుండా మంత్రి పదవి ఇవ్వాలని కోరుతున్నాం. రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత కాంగ్రెస్‌కు కొత్త శక్తి వచ్చింది. అలాంటి వ్యక్తికి తెలంగాణ సమాజం మంత్రి పదవి ఇవ్వకపోతే తిరగబడే అవకాశం ఉంది. సీఎం కేబినెట్‌లో రాజగోపాల్‌రెడ్డికి కచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాలి.

# దీరజ్‌సాహూ ఇంట్లో రూ. 350 కోట్లు!

- గుట్టలు, గుట్టలుగా అక్రమాస్తులు
- తండ్రి దేశానికి ‘దానం’ చేస్తే..
- కొడుకు రూ. వందల కోట్ల అక్రమ సంపాదన!
- కాంగ్రెస్‌పార్టీతో విడదీయలేని బంధం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



ఝార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూకు సంబంధించిన కంపెనీలపై ఆదాయపన్ను అధికారులు జరిపిన దాడుల్లో రూ. వందల కోట్ల విలువైన కరెన్సీ లభ్యం కావడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. వాటిని లెక్కించేందుకు 50 మందికిపైగా సిబ్బంది, 40 కౌంటింగ్ మెషిన్లను వినియోగించడం గమనార్హం. ఐదు రోజులు లెక్కించగా సుమారు రూ.350కోట్లకుపైగా నగదు ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే ధీరజ్ సాహూ, ఆయన కుటుంబానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. ధీరజ్ కుమార్ తండ్రి బల్‌దేవ్ స్వాతంత్ర్య సమర యోధుడు. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందిన సమయంలో .. ఆయన భారత ప్రభుత్వానికి రూ.47 లక్షల నగదు, 47 కిలోల బంగారాన్ని విరాళంగా ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇలా తండ్రి దేశానికి దానం ఇస్తే.. కుమారుడు మాత్రం అక్రమ సంపాదనలో ఆరితేరిపోయాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**కాంగ్రెస్‌తో ఎనలేని అనుబంధం..**

ధీరజ్ ప్రసాద్ సాహూకు ఐదుగురు సోదరులు. వీరిలో సాహు సహా నలుగురు రాజకీయాల్లో ఉన్నారు. ఒక సోదరుడు శివ్ ప్రసాద్ సాహూ లోక్‌సభ ఎంపీగా పనిచేశారు. కాంగ్రెస్ తరఫున రాంచీ స్థానం నుంచి రెండుసార్లు ఎన్నికయ్యారు. 2001లో ఆయన మృతి చెందారు. మరో సోదరుడు నందలాల్ సాహూ కూడా లేరు. ధీరజ్ మరో సోదరుడు గోపాల్ సాహూ కాంగ్రెస్‌లో చురుకుగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో హజారీబాగ్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. మరో సోదరుడు ఉదయ్ సాహూ కూడా ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. ధీరజ్ సాహూ ఝార్ఖండ్‌లోని చతరా నుంచి రెండుసార్లు పోటీ చేసి.. ఓటమిపాలయ్యాడు. 2009లో రాజ్యసభ ఉప ఎన్నికలో ఎంపికైన అతడు.. జులై 2010లో మరోసారి ఎన్నికయ్యాడు. 2018లో మూడోసారి రాజ్యసభ సభ్యుడిగా అడుగుపెట్టాడు. ధీరజ్ సోదరుడు శివ్ ప్రసాద్ సాహూ ఇందిరా గాంధీతో సత్సంబంధాలు ఉండేవి. దీంతో ఆయన కుటుంబానికి పార్లమెంటు, అసెంబ్లీతోపాటు మంత్రి పదవుల్లోనూ ఆధిపత్యం కొనసాగింది. సాహూ కుటుంబం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా, ఆర్థికంగానూ ఎంతో మద్దతుగా నిలిచేదని చెబుతుంటారు. ముఖ్యంగా ఝార్ఖండ్‌లోని లోహర్‌దాగాతోపాటు సమీప జిల్లాల్లో వీరికి మంచి పట్టు ఉంది. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో ఈ కుటుంబం చురుకుగా వ్యవహరిస్తుంటుంది. వీళ్ల పూర్వీకుల ఇంటిని ‘వైట్ హౌస్ ఆఫ్ లోహర్‌దాగా’గా పిలిచేవారు. ఇక్కడికి రాజకీయ నేతలే కాకుండా సినీనటులు, క్రికెటర్లు కూడా వచ్చేవారట. సాహు కుటుంబానిది ‘మద్యం’ ప్రధాన వ్యాపారం. వీరికి సంబంధించి ఒడిశాలో ఎన్నో డిస్టిలరీలు ఉన్నాయి.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
www.vishalabharati.com
epaper:vishalabharati.com
GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
3
మంగళవారం,
12.12. 2023
హైదరాబాద్



## ప్రజావాణిలో సమస్యలకు సత్వర పరిష్కారం

**శాఖల వారీగా దరఖాస్తుల పై విచారణ**

**సూర్యాపేట, విశాలభారతి:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాలు నందు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వేబిక్స్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అదనపు కలెక్టర్ ఏ వెంకట్ రెడ్డి తో కలిసి ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 18 దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు వివిధ ప్రజావాణిలో వచ్చిన 105 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని, నూతన ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమానికి కూడా తమ సమస్యలపై ప్రజలు దరఖాస్తు చేసుకుంటారని, అధికారులు తమ శాఖకు చెందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖలకు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని రెవెన్యూ డివిజన్ల వారిగా భూ సమస్యలను ఆర్డీవోలతో, తాసిల్దారులతో చర్చించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని, ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు ఏ కారణం వలన పరిష్కరించలేకపోయామో అట్టి విషయాన్ని కూడా ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డి ఆర్ డి ఓ పి డి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో సురేష్ , వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## రైతాంగ నాయకులపై ప్రతికార చర్యలను నిలిపివేయాలి

**రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి**

**ఎస్ కే యం డిమాండ్**

**మహబూబాబాద్ విశాల భారతి:** సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) జాతీయ సమన్వయ కమిటీ ఇచ్చిన జిల్లా కలెక్టర్ల ద్వారా రాష్ట్రపతికి విజ్ఞాపన పత్రం అందజేయాలని ఇచ్చిన దేశవ్యాప్త పిలుపు మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ కు విజ్ఞాపన పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్కేయం తెలంగాణ రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న మాట్లాడుతూ.. మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం తీసుకురావాలని, పంటల బీమా, రైతు నాయకుల పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, రైతాంగ ఉద్యమం సందర్భంగా మరణించిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని, నూతన విద్యుత్ విధానాన్ని వెనుకకు తీసుకోవాలని, లకింపూర్ కేరి హత్యాకాండ కు బాధ్యులైన అజయ్ మిశ్రా అసిస్ మిశ్రాలపై చర్యలు తీసుకోవాలని, రైతాంగ ఉద్యమం సందర్భంగా చేసిన డిమాండ్లను మోడీ ప్రభుత్వం అమలు చేస్తామని ఆమోదించి రాత పూర్వకంగా ఇచ్చిన హామీని రెండు సంవత్సరాలు దాటిపోయినప్పటికీ కేంద్ర ప్రభుత్వంఅమలు చేయలేదు. మోడీ ఇచ్చిన హామీలను బుట్ట దాఖలు చేశాడు. తిరిగి రైతాంగం పై మరోసారి నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. ఎస్ కే యం జాతీయ నాయకుడు యద్విర్ సింగ్ పై కేసు ఉన్నదనే కారణంగా తన ప్రయాణాన్ని అడ్డుకొని అక్రమంగా నిర్బంధించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ చర్యలు దుర్మార్గమైనవి, కక్షపూరితమైనవి, ఇలాంటి చర్యలను మోడీ ప్రభుత్వం మానుకోవాలని తక్షణం రైతాంగానికి ఇచ్చిన హామీలను తాత్సారం చేయకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## రైతాంగానికి వెంటనే నష్టపరిహారం ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ కి అఖిలభారత రైతు కూలీ సంఘం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం**




**మహబూబాబాద్, విశాల భారతి:** రాష్ట్రంలో మిచంగ్ తుఫాను రైతాంగానికి తీవ్రంగా నష్టపరిచిందని చేతికొచ్చిన వరి పంట పొలాల్లో దెబ్బతినిపోయిందని నూర్పిడి చేసిన పంట కొనుగోలు కేంద్రాలలో తడిసిపోయిందని పత్తి పంట వర్షానికి తడిసి రంగు మారిందని వర్షాధారంతో వేసిన మొక్కజొన్న పంట వర్ష భవ పరిస్థితుల వలన దిగుబడి రాకపెట్టిన పెట్టుబడులు కూడా రానుడి పరిస్థితి ఏర్పడిందని అఖిలభారత రైతు కూలి సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి సక్రులు కలెక్టర్ కోరారు. అలాగే మిర్చి పంటకు గుబ్బ తెగులు తామర పురుగు ఎర్రనల్లి లాంటి తెగులు సోకి వేలాది ఎకరాలలో పంట నష్టం జరిగిందని ఒకవైపు తెగులు మరొకవైపు అకాల వర్షాలు వర్షభావ పరిస్థితుల వలన రైతులు ఆరుగాలం చేసిన కష్టం పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టాలకు గురయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఇతర పంటలకు నష్టం అంచనాలు వేసి నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారంగా పంటల వారీగా వరికి 30.000 మొక్కజొన్నకు 30,000 పత్తికి 50,000 మిర్చి పంటకు లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం అందించి నష్టపోయిన అన్ని పంటలకు భీమ పథకాన్ని అమలు చేస్తూ ఆదుకోవాలని అఖిలభారత రైతు సంఘం డిమాండ్ చేస్తుంది.



## ఎమ్మెల్యే రామచందర్ నాయక్ కు సన్మానం

**సూర్యాపేట, విశాలభారతి:** డోర్నకల్ ఎమ్మెల్యే రామచందర్ నాయక్ ను జిల్లా కాంగ్రెస్ నాయకులు శనగాని రాంబాబు గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ శివ సాయి హాస్పిటల్ నిర్వహిస్తూ డోర్నకల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన రామచందర్ నాయక్ మొదటి సారిగా సూర్యాపేటకు వచ్చేసిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలో శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు సాజిద్ ఖాన్, ఎల్గూరి రవి, గుడ గుంట్ల గోవర్ధన్, కళ్యాణ్, చోటు, గోపి,లాలునాయక్, శివ, వైఎల్ ఎన్ గౌడ్, అనంతుల మల్లయ్య, వెంకన్న గౌడ్,ఎస్ రాములు, ఉపేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## చదువుల తల్లికి అండగా జగదీష్ రెడ్డి

- గిరిజన పుత్రిక పట్ల ఔదార్యం చాటిన గుంటకండ్ల
- ఆర్థిక సహాయం అందజేసి అక్కున చేర్చుకున్న మాజీ మంత్రి

**సూర్యాపేట, విశాలభారతి :** ఉన్నత చదువులకు ఆటంకంగా నిలిచిన ఆర్థిక పరిస్థితి తొ దిక్కుతోచని స్థితిలో ఉన్న గిరిజన నిరుపేద విద్యార్థినికి మజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అండగా నిలిచారు. ఆమె విద్యాభ్యాసం పూర్తి అయ్యే వరకు అండగా ఉంటానని భరోసానిచ్చారు. సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలం లాల్ సింగ్ తాండా కి చెందిన బానోతు ఐశ్వర్య చిన్ననాటి నుంచి చదువులో అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తూ వస్తుంది. బి.ఎస్.సి నర్సింగ్ కు గాను ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లో సీటు సాదించిన ఐశ్వర్య, వ్యవసాయ కూలీ కుటుంభం కావడం తొ ఇతర ఖర్చులు కూడా భరించ లేని స్థితి లో ఉంది. దీంతో అక్కడి స్థానిక నాయకుల ద్వార పరిస్థితి జగదీష్ రెడ్డి గారి దృష్టికి వచ్చింది. ఐశ్వర్య పాటు ఆమె తల్లిని సూర్యాపేటకు పిలిపించిన శాసన సభ్యులు ఐశ్వర్య విద్య పూర్తయ్యే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఐశ్వర్య ఉన్నత విద్య పూర్తయ్యే వరకు తాను బాధ్యత తీసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అత్యంత నిరుపేద పరిస్థితుల్లో అనేక సవాళ్లు దాటుకొని చదువులో రాణిస్తున్న ఐశ్వర్య తోటి విద్యార్థులకి ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.





## ఏపికీ జగన్ సీఎం కావాలి

**భద్రాచలం, విశాల భారతి:** ఎమ్మెల్సీ అనంత బాబు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కు జగన్ సీఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని ఎటపాక మండలం గుండాల సచివాలయంలో పురుషోత్తపట్నం సర్పంచ్ బుద్ధ ఆదినారాయణ ప్రారంభించారు. ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన, సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు నగదు ఎంత చేకూరింది అనే విషయాన్ని కూడా తెలియజేశారు. రానున్న కాలంలో కూడా ఈ పథకాలు అమలు అవుతాయని తెలియజేశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు ఎవరికైనా రానట్లయితే, వారందరికీ కూడా పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ స్టాఫ్ కు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలోగుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, సర్పంచులు, బుద్ధ ఆదినారాయణ, గుండి శీతాలక్ష్మి , ఉప సర్పంచ్ తోట శశి కుమార్, సచివాలయ కన్వీనర్లు, దామెర్ల రేవతి( జిల్లా కార్యదర్శి), జయ చంద్రారెడ్డి, ఎర్రగోల నరసింహారావు, కాకాని సురేష్, ముత్తిబోయిన రాము,, సెక్రటరీలు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సచివాలయ స్టాఫ్, వార్డు మెంబర్లు, వైఎస్ఆర్సిపి నాయకులు ముఖ్య కార్యకర్తలు అభిమానులు, గ్రామ ప్రజలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆకునూర్ పాఠశాల విద్యార్థులు

**సైదాపూర్, విశాల భారతి:** మండలంలోని ఆకునూరు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పి సంజన, ఎమ్ ఎం ప్రగతి, ఆర్ రాహుల్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి, వ్యాయామ ఉపాధ్యాయుడు భక్తు రాజ్ కుమార్ తెలిపారు. ఈనెల 13 నుండి 15 వరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అష్ట స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి వ్యాయామ ఉపాధ్యాయుడు భక్తు రాజకుమార్ ఉపాధ్యాయ బృందం అభినందించారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు.




ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బైరి సుధాకర్ రవీందర్ రెడ్డి గోదారి సమ్మయ్య కోట సమ్మయ్య విజయ్ కుమార్ శాంత కుమార్ సింగ్ అంబికా రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మోదీ నిర్ణయం గొప్ప విజయం

**బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వి.ఎన్.శాస్త్రి**

**నెల్లికుదురు విశాల భారతి:** భారత అత్యున్నత న్యాయస్థానం సిజెఐ చంద్రచూడ్ కశ్మీర్ పై కేంద్రం 370ఆర్టికల్ రద్దు చేయడం సమర్థనీయమని సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించడం తో ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయానికి గొప్ప విజయం చేకూరిందనిబిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వెలుకూచి నాగయ్య శాస్త్రి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రం నెల్లికుదురులో మాట్లాడుతూ..దేశంలో జమ్మూ కాశ్మీర్ అంతర్భాగమని ప్రభుత్వ నిర్ణయం సమర్థిస్తూ చారిత్రక నిర్ణయం ప్రకటించడం పట్ల మోదీ దేశం కోసం జమ్మూ కాశ్మీర్ ను కాపాడారని, దేశ హితమే ఆయన లక్ష్యం అని మరోసారి రుజువైందన్నారు. ఆర్టికల్



370 రద్దు వ్యతిరేకుల వాదనలు సుప్రీం కోర్టు తోసిపుచ్చడం వారికి ఆత్మహత్యా సదృశ్యమన్నారు.



## సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి

**జెడ్పీటీసీ పున్న లక్ష్మీ జగన్మోహన్**

**రామన్నపేట, విశాల భారతి:** రాష్ట్రంలో కొత్తగా కొలువు తీరిన కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అందేలా కృషి చేస్తామని స్థానిక జడ్పిటిసి పున్న లక్ష్మీ జగన్మోహన్ అన్నారు రామన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలకు సంక్షేమ పథకాలను తారతమ్యం లేకుండా అర్హులకు అందే విధంగా కృషి చేస్తామని మండలంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు,సూచనలు చేస్తూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నాగటి ఉపేందర్, పంచాయతి రాజ్ ఏ.ఈ బోయ గాలయ్య ఎంపిటిసి సభ్యులు మాడూరి జ్యోతి రామచంద్ర రావు,బడుగు రమేష్ సర్పంచ్ ల ఫోరం మండల అద్యక్షులు గుత్తా నర్సింహా రెడ్డి, గోదాసు శిరీష పృధ్వీరాజ్, జెల్లెల లక్ష్మమ్మ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కేసిఆర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే వేముల



**బాల్కొండ, విశాల భారతి:** యశోదా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ ను బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగ ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి కేసిఆర్ ను అడిగి తెలుసుకున్నారు.

## ప్రైవేట్ స్కూల్, కాలేజీల అరాచకాలు అరికట్టాలి

**మహాజన సమితి రాష్ట్ర ఆదివాసి మహిళ ఉపాధ్యక్షురాలు కంగాల రమణ కుమారి డిమాండ్**



**భద్రాచలం, విశాల భారతి:** భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ప్రవేట్ స్కూల్ కాలేజీల యాజమాన్యం ఇష్టానుసారంగా ఫీజులు పెంచి విద్యార్థులపై భారం మోపుతున్నారని మహాజన సమితి రాష్ట్ర ఆదివాసి మహిళ ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిఫ్త్ షెడ్యూల్ ఏరియాలో విద్య వ్యాపారం యదేచ్ఛగా కొనసాగటం ఏంటని ఆమె ప్రశ్నించారు నియంత్రణ లేని ఫీజులు అరకొర సౌకర్యాలతో ప్రైవేట్ స్కూల్లో కాలేజీల యాజమాన్యం జలగల్లా పీల్చుకు తింటున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు ఏజెన్సీ ప్రాంతంలో అడిగే వారే లేరన్నట్టు ఇష్టానుసారంగా అందిన కాడికి డబ్బులు గుంజుతున్నారని ఆమె అన్నారు నిర్దిష్టమైన ధరల పట్టిక ఏర్పాటు చేయకుండా కార్పొరేట్ స్కూల్స్ సాధారణ ప్రవేట్ స్కూల్ కాలేజీస్ కూడా. అధిక ఫీజులతో దోపిడీకి పాల్పడుతున్నారని ఆమె మండిపడ్డారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం పట్ల ఆంతర్యం ఏమిటని ఆమె అన్నారు. విద్యాహక్కు చట్టం ఎక్కడ అమలు కావట్లేదని ఆమె తెలిపారు. పుస్తకాలు దుస్తులు పరీక్ష ఫీజులు అడ్మిషన్ ఫీజులు రెడ్ రోజ్ ఎల్లో రోజు అంటూ అనేక వారాల పేరు మీద విద్యార్థుల వద్ద అధిక మొత్తంలో డబ్బులు పిండుకుంటున్నారని పిండుకున్నోళ్లకు పిండుకున్నంత అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని. ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను కాపాడాలని ఆమె అన్నారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నప్రైవేట్ స్కూల్స్ కాలేజిలను. నియంత్రించాలని. ఆమె అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ కాలేజీల యాజమాన్యం వెనుక అండదండగా ఉండి విద్యార్థుల వద్ద అధిక ఫీజులను వసూలు చేస్తున్న వారిపైన విచారణ జరిపించి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.



## ఎమ్మెల్యేను సన్మానించిన ఉపసర్పంచ్

**నారాయణఖేడ్, విశాల భారతి:** నూతన ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారి నారాయణఖేడ్ వచ్చిన సంజీవ్ రెడ్డిను చాప్ట కే గ్రామ ఉపసర్పంచ్ గంగయ్య స్వామి, pacs డైరక్టర్ బస్వారాజ్, మాలిపటేల్ నారాయణ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



## నెల్లికుదురు ఎంపీపీ పై అవిశ్వాసం

**ఒక్కటవుతున్న వివిధ పార్టీల ఎంపీటీసీలు**

**నెల్లికుదురు విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి నవీన్ రావ్ పైఅవిశ్వాస పరీక్ష కోసం వివిధ పార్టీల ఎంపిటిసిలు ఒక్కటవుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం మండలంలోని ఓ రహస్య ప్రదేశంలో నలుగురు ఎంపీటీసీలు, ఓ ఎంపీటీసీ కుమారుడు, మరో ఎంపీటీసీ భర్త హాజరై ఈ మేరకు చర్చించుకున్నారు. మరో మూడు నాలుగు నెలలలో స్థానిక సంస్థల ఎలక్షన్లు ఉండగా ఈ కొంత సమయానికే ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేస్తారనే సమాచారం పై మండలంలో ఆసక్తి నెలకొంది. కాగా ఎంపీపీని తొలగించడానికి గల కారణాలు ఏమై ఉంటాయని పరిశీలించగా ఎంపీపీ మాధవి బి ఆర్ ఎస్ పార్టీకి చెందినది కావడం, అధికార, ప్రతిపక్షఎంపీటీసీల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా, పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం,ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం అభివృద్ధి నిర్ణయాలను ప్రకటించకపోవడం విషయాలతో పాటు ఏకపక్షంగా వ్యవహరించడం ఇటీవల జరిగిన ఎలక్షన్లలో అధికార బిఆర్ఎస్ పార్టీ ఓడిపోవడం వంటివని పలువురు ఎంపీటీసీలు వెల్లడిస్తున్నారు. అవిశ్వాసం కోసం కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ లతోపాటు బిఆర్ఎస్,బిజెపి కి చెందిన పలువురు ఎంపీటీసీలు ఏకమవుతున్నారు. నేడో,రేపో అవిశ్వాస తీర్మానానికి అవసరమైన ఎంపిటిసిల కన్నా ఎక్కువమంది కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. కాగా సమావేశమైన వారిలో బిఆర్ఎస్ నుంచి శాసనసభ ఎలక్షన్ల ముందు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, కదిర జగన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పెరుమాండ్ల గుట్టయ్య గౌడ్, వెల్ది గోవర్ధన్, ఓ బిజెపి ఎంపీటీసీ భర్త నల్లాని పాపారావు, బిఆర్ఎస్ ఎంపీటీసీ కుమారుడు హనుమంతు ఉన్నారు.



## యశ్వంత్ నాయక్ మరిన్ని విజయాలు సాధించాలి

### రాచకొండ సీపీ దేవేంద్ర సింగ్‌చౌహాన్

**విశాల భారతి, సిటీ బ్యూరో:** తెలంగాణ యువ పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ నాయక్ ఇటీవల ఆస్ట్రేలియాలోని ఎత్తయిన కోషియాస్కో పర్వతం మీద భారత జాతీయ జెండాతో పాటుగా రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఫొటోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాచకొండ కమిషనర్ ను నేరేడ్ మెట్ లోని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. శ్రమించే క్రీడాకారులకు అవసరమైన తోడ్పాటు ప్రోత్సాహం ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. ప్రపంచంలోని మరిన్ని ప్రఖ్యాత పర్వతాలను నిరంతర శ్రమతో దిగ్విజయంగా అధిరోహించి దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పర్వతారోహణ ఎన్నో సవాళ్లతో కూడుకున్న పని అని, ఎంతో కష్టతరమైనదని అన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వేముల
- ఆరోగ్యశ్రీ పెంపు హర్షణీయం -ఎమ్మెల్యే
- కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం
- ఆరోగ్యశ్రీ 5లక్షల నుండి 10 లక్షలకు పెంపు
- ఆరోగ్యశ్రీ సేవల పోస్టర్ ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**నకిరేకల్, విశాలభారతి:** ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10 లక్షల రూపాయల ఆరోగ్య సేవల పోస్టర్ ను నకిరేకల్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పెంపు హర్షణీయమని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన 6గ్యారంటీ హామీల్లో ఆరోగ్యశ్రీ పెంపు కూడా ఒకటని ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు అవగానే అమలు చేసిందన్నారు. నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడే ఆరోగ్యశ్రీ ని 5లక్షల నుండి 10లక్షలకు పెంచడం హర్షణీయమని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీకి రూ.5లక్షల వరకూ అందించిందని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రూ.10 లక్షలకు పెంచిందన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ కింద 1326 జబ్బులకు మాత్రమే పరిమితని ఇప్పుడు 1600పైగా జబ్బులకు చికిత్స అందుబాటులో ఉందన్నారు. సోనియాగాంధీ ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని వారికి అనుగుణంగా ఆరు గ్యారెంటీ పథకాలను తీసుకొచ్చారని అన్నారు. కాంగ్రెస్ పాలలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. నకిరేకల్ నియోజకవర్గాన్ని జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, డిఎంహెచ్ ఓ కొండల్ రావు, నకిరేకల్ మున్సిపాలిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, డిసిహెచ్ ఎస్, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, నకిరేకల్ యంపిపి బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్, చిట్యాల మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్ రెడ్డి, కట్టంగూర్ యంపిపి జెల్లా ముత్తిలింగం, కేతేపల్లి యం.పి.పి పెరుమళ్ల శేఖర్, స్థానిక కౌన్సిలర్లు, వైద్యులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మోతె ప్రెస్ క్లబ్ ఏకగ్రవంగా ఎన్నిక

**మోతె, విశాల భారతి:** వర్కింగ్ జర్నలిస్ట్ మోతె మండల ప్రస్ క్లబ్ అధ్యక్ష ఎన్నిక సోమవారం ఏకగ్రివంగా ఎన్నికోడం జరిగింది. మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పల్లెల లక్ష్మణ్ రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల వర్కింగ్ జర్నలిస్టు సంఘం తెలిపింది. ఉపాధ్యక్షులుగా మాలోతు కోటి, ప్రధాన కార్యదర్శి గా ఏర్పుల సాయి కృష్ణ ,సహాయ కార్యదర్శి గా గురిజాల వెంకన్న , కోషాధికారిగా గట్టిగుండ్ల రాము, గౌరవ సలహా దారు గా పల్లెల రాము, కమిటీ సభ్యులు గా ,కొండ ఉదయ్, నాగరాజు లు ,ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నిక అనంతరం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పల్లెల లక్ష్మణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం వారి సమస్యల కోసం నిరంతరం పోరాడుతానని జర్నలిస్టుల అభివృద్ధికి పాటుపడతానని ఎల్లవేళలా జర్నలిస్ట్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## ఫ్రీ బస్.. మంచిర్యాల డిపో టాప్

**మంచిర్యాల, విశాల భారతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మహాలక్ష్మి పథకానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ స్పందన లభించింది. ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో 65,953 మంది మహిళా ప్రయాణికులు తొలిరోజు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారు. అత్యధికంగా మంచిర్యాల డిపో 184 18,331, 32 16,627, 6 10,874, 0 10,519, 5,509 65, ఉట్నూరు 4,093 మంది మహిళా ప్రయాణికులు పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. రాబోయే కాలంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొందరు ఈ పథకం మంచిదంటే మరికొందరు దీనివల్ల చాలా మంది ఉపాధి కోల్పోయారని చర్చించుకుంటున్నారు.





## రామచంద్రునాయక్ ను కలిసేందుకు కదం తొక్కిన కాంగ్రెస్ కార్యకర్తలు

**మహబూబాబాద్, విశాల భారతి:** జిల్లా కురవి మండలం బంచరాయితండ నుండి ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ ను కలిసేందుకు మరిపెడకు కదం తొక్కిన కాంగ్రెస్ కార్యకర్తలు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు లూనావత్ విజయ్ నాయక్ మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ ని మరిపెడ బంగ్లాలో కాంగ్రెస్ నాయకత్వం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేయడం జరిగింది. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే రామచంద్రనాయక్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పేద బడుగు బలహీన వర్గాలకు చేయూతనందిస్తూ డోర్నకల్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికై ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పున్నం, రామారావు, సాదు, బోజ్యా, వీరన్న, శంకర్, వేంకన్న, విజ్జు, బద్రు, బాలు, రమేష్, కిషన్, జగ్మల్, వాల్యి, హర్జున్, గొప్ప, నరేష్, ప్రతాప్, చింటూ, తదితరులు పాల్గొన్నారు.



## పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన మేకల మల్లిబాబు యాదవ్

**మహబూబాబాద్, విశాల భారతి:** రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మాత్యులుగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొలిసారిగా ఖమ్మం వచ్చిన సందర్భంగా వారి స్వగృహంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాత్రికేయులతో మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ.. పొంగులేటి శీనన్న గత ప్రభుత్వాన్ని ఛాలెంజ్ చేసి, అనుకున్నట్లుగా బి.ఆర్.ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడం జరిగిందని, ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ప్రజా హృదయనేత శీనన్నకు కీలకమైన బాధ్యతతో కూడిన శాఖలు రావడం చాలా ఆనందంగా ఉందని, జిల్లా వ్యాప్తంగా యాదవ కురుమలు, బడుగు బలహీన వర్గాల వారు, గత ప్రభుత్వ హయాంలో నిరంకుశ విధానాల వల్ల మోసపోయిన వారు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ గెలుపుతో భరోసాతో ఉన్నారని, పొంగులేటి అభిమానులు కార్యకర్తలు చాలా సంతోషంగా ఉన్నారని, హర్షం ప్రకటించారు. ఓటమిపాలైన వారు ఆవేశంతో రెచ్చగొట్టే విధంగా కార్యక్రమాలు చేసే అవకాశం ఉందని, అందరూ సంయమనం పాటించాలని, అక్కడికి వచ్చిన సందర్శకులకు శీనన్న సూచించారని మల్లి బాబు యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ పతే మహమ్మద్, ప్రముఖ డాక్టర్ గోంగూర వెంకటేశ్వరరావు, మరియు కామేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## రాబోయే ఎన్నికలకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

**సూర్యాపేట, విశాలభారతి:** ఎన్నికలకు జిల్లా యంత్రాంగం అన్నివిధాలా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి లోని ఎన్. ఐ.సి. వీడియో కాన్ఫరెన్స్ హాల్లో త్వరలో జరగబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పటిష్టమైన నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ లను ఆదేశించారు. ఈ.వి.ఎమ్.లు, వి.వి.ప్యాట్ లు వేరు వేరుగా ఏర్పాటు చేసి మరొకసారి చెకింగ్ చేపట్టాలని, ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. 2024, జనవరి 1 వ తేదీని దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితా సవరింపులో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై పక్క ప్రణాళిక తో ఉండాలన్నారు. ఈ వి.సి.లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ ఏ వెంకట్ రెడ్డి, ఆర్డీవోలు సూర్యనారాయణ, జగదీష్ రెడ్డి, వీరబ్రహ్మచారి, ఎన్నికల విభాగం తహసీల్దార్ శ్రీనివాస రాజు, డిటి వేణు, సిబ్బంది రంజిత్ పాల్గొన్నారు.



## ఘనంగా శివపార్వతుల కల్యాణం

**నారాయణఖేడ్, విశాలా భారతి:** నారాయణఖేడ్ లోని మహంకాళి నగర్ ముత్యాల పోచమ్మ ఆలయం దగ్గర కార్తీక మాసం పురస్కరించుకొని శివపార్వతుల కళ్యాణము, కార్తిక దీపోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వేద పండితులు గురు రాజ్ శర్మ, వెంకటేశం సార్ సాయి సెట్, విజయ్, రవి గౌడ్, గోపి సెట్ కాలనీవాసులు పాల్గొన్నారు.



## గంగమ్మకు హారతి

**ఆర్మూర్, విశాల భారతి:** నందిపేట్ మండలంలోని ఉమ్మేడ గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయం వద్ద గంగమ్మకు వేద పండితుల ఆధ్వర్యంలో హారతి ఇచ్చారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి చివరి రోజున హారతి ఇచ్చి శివపార్వతుల సమక్షంలో 108 దీపాలను వెలిగిస్తారు. మధ్యాహ్నం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాముడ పోశెట్టి, ఎంపీటీసీ మక్కూర్ మనోజ్ రావ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా ఋషి తుల్య మహా పడిపూజ

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలో గల కొత్త గుడి కాపు సంఘంలో అంగరంగ వైభవంగా శ్రీ పూర్ణ పుష్కలాంబ సమేత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహా పూజ, గణపతి పూజ, సుబ్రహ్మణ్యస్వామి పూజ కార్యక్రమం గురుస్వామి ఆనంద్ కుమార్ 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఋషి తుల్య మహా పడిపూజ నిర్వహించారు. ఈ పూజకు మండల కేంద్రంలో అన్ని గ్రామాల నుండి సుమారు 200 మంది వరకు అయ్యప్ప స్వాములు వచ్చారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు గడ్డం తిరుపతిరెడ్డి, మనోహర్ రెడ్డి , అర్చకులు కులకర్ణి శ్రీనివాస్, గురులింగం శివయ్య, కిషన్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రారంభించిన ఎమ్మెల్యే

**భువనగిరి, విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఈరోజు నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీ 10 లక్షల రూపాయలకు పెంచుతూ మరియు రాష్ట్ర మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని కల్పించడానికి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భువనగిరి బస్టాండ్లో బాణాసంచా కాల్చి మహిళా ప్రయాణికులకు స్వీట్లు పంచి ప్రభుత్వ పథకాల అమలుగురించి వివరించడం జరిగింది. పలువురు ప్రయాణికులు ఈ పథకాన్ని అమలుపరుస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కీర్తి రెడ్డి పిసిసి ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్ పిసిసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ కుర వెంకటేష్ ,ఎంపీపీ నిర్మల వెంకటస్వామి వలిగొండ ఎంపీపీ నూతి రమేష్ రాజ్ ఎలిమినేటి కృష్ణారెడ్డి ఎండి తహర్ మహిళా ఎలా ప్రెసిడెంట్ కాల్వ స్వాతి నాయకులు కౌన్సిలర్లు పడిగల రేణుక ప్రదీప్ ఇరపాక నరసింహ,లక్ష్మి కృష్ణ యాదవ్ నజీమ సల్లవుద్దిన్ , రజిత,నాయకులు పాల్గొన్నారు.




## స్వచ్ టాయిలెట్ క్యాంపెయిన్

తుర్కయంజాల్, విశాలభారతి:తుర్కయంజాల్ పురపాలక సంఘం ఆద్వర్యంలో స్వచ్ఛ టాయిలెట్ క్యాంపెయిన్ నిర్వహించినట్లు కమీషనర్ శ్రీకాంత్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ 4వ వార్డులో పబ్లిక్ టాయిలెట్స్ దగ్గర ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొని పబ్లిక్ టాయిలెట్స్ దగ్గర రంగులతో ముగ్గులు వేశారు. బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధానికి పాటుపడుతామని ప్రతిజ్ఞ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలు బహిరంగ మలమూత్ర విసర్జన చేయరాదని, పబ్లిక్ టాయిలెట్లను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరు పర్యావరణ పరరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ హరీష్, పారిశుధ్య జవాన్ నగేష్ పాల్గొన్నారు.






## వి దా వాయిస్ ఆఫ్ పీపుల్ సొసైటీ ఏర్పాటు

**మందమర్రి టౌన్, విశాల భారతి:** ప్రజలకు వచ్చిన ఆపద నుండి విముక్తి కలిగించి వారి తరఫున గొంతుకై, వారికి వచ్చిన సమస్య నుండి బయటపడేయడమే ముఖ్య ఉద్దేశంగా ఏర్పడింది వీ దా వాయిస్ ఆఫ్ పీపుల్ సొసైటీ అని సొసైటీ అధ్యక్షుడు మోకనపల్లి బద్రి, అధ్యక్షులు దుర్గం క్రాంతి అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా ఆదివారం మందమర్రి పట్టణంలో సొసైటీ కి సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న అసమానతలను, వ్యక్తుల హక్కులు, బాధ్యతలు తెలియజేసే ముఖ్య ఉద్దేశంతో ఏర్పడినదే వీ దా వాయిస్ ఆఫ్ పీపుల్ సొసైటీ అని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటిని ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడిగా మోకనపల్లి బద్రి, అధ్యక్షులుగా దుర్గం క్రాంతి, ఉపాధ్యక్షులుగా కూనమల్ల సాయి శ్రీ, సాయికృష్ణ కౌండిన్య, జనరల్ సెక్రెటరీగా రఘుపతి రామగిరి, ఉమెన్ సెక్రెటరీగా దాసరి భాగ్యశ్రీ, జాయింట్ సెక్రెటరీగా కత్తెర్ల సంజీవ్ & కళ్యాణ్ కృష్ణ గోలేటి, ట్రెజరీగా కార్తీక్ నాగుల, సోషల్ మీడియా ఆర్గనైజర్ గా బిజ్జురి తరుణ్, లీగల్ అడ్వైజర్ గా అడ్వకేట్ ప్రశాంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా దుర్గం కిషన్ ను ఎన్నుకున్నారు.

# క్యాన్సర్ మహమ్మారితో వీధినబడ్డ కుటుంబం



**మందమర్రి టౌన్, విశాల భారతి:** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం మేడారం గ్రామానికి చెందిన డ్రైవర్ వృత్తిలో అన్యోన్యంగా సాగుతున్న పచ్చని సామాన్య కుటుంబంలో క్యాన్సర్ అనే మహమ్మారి బారినబడి కుటుంబం పిల్లల భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారింది. దీనికంతటికి కారణం కుటుంబాన్ని పోషించాల్సిన చిప్పకుర్తి రాజనర్సయ్య కిడ్నీకి క్యాన్సర్ సోకడంతో ఇటీవల హైదరాబాదులోని బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రిలో ఆపరేషన్ జరిగింది. ఇప్పటికే తనకు ఉన్నదంతా ఖర్చు చేసుకున్న ఆ కుటుంబానికి మళ్లీ చికిత్స కోసం పది లక్షల వరకు ఖర్చవుతుందని ఆసుపత్రి వర్గాలు తెలపడంతో రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో సహాయం కోసం కనపడ్డ ప్రతి వారిని వేడుకుంటున్న తీరు కంటతడి పెట్టిస్తున్నది. అతనికి ముగ్గురు కూతుర్లు పెద్ద కూతురికి వివాహం కాగా, రెండవ కూతురు ఐదవ తరగతి, చిన్న కూతురు రెండవ తరగతి చదువుకుంటున్న పసికూనలు కావడంతో పిల్లల భవిష్యత్తును ఊహించుకుని ఆ కుటుంబం తల్లడిల్లుతున్నది. ఎవరైనా దయార్ధ హృదయంతో వైద్య సహాయం కోసం తనకు సహకరిస్తే తప్ప తన కుటుంబ పరిస్థితి నిలదొక్కుకునే పరిస్థితి లేదని రాజనర్సయ్య కనపడ్డవారినల్లా వేడుకుంటున్నాడు. ఎవరైనా దాతలు ఈ కుటుంబానికి సహాయం చేయదలిస్తే 8688725757 ఈ నెంబర్లకి సంప్రదించవచ్చునని పత్రిక విలేకరులను, మీడియా ప్రతినిధులను ఆ కుటుంబ సభ్యులు చేతులెత్తి మొక్కుతున్నారు.



# బెల్ట్ షాపులను నియంత్రించాలి

- సామాజిక బాధ్యత తో ముందుకొచ్చిన ఛత్రపతి శివాజీ యూత్
- వైన్స్ నిర్వాహకులకు వినతి పత్రం అందజేత
- కొత్త ప్రభుత్వం రాకతో బెల్ట్ షాపుల కట్టడి పై ఆశలు.



**కొందుర్గు,విశాలభారతి:** కొందుర్గు మండల కేంద్రములో గల చట్ట విరుద్ధమైన బెల్ట్ షాపులను నియంత్రించాలని స్థానిక ఛత్రపతి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో వైన్స్ షాపుల నిర్వాహకులకు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ... కొందుర్గు మండల కేంద్రములో అధికారికంగా 2 వైన్స్ షాపులు ఉన్నపటికీ రోజురోజుకు పుట్ట గొడుగుల్లా గల్లిగల్లీ లో 50 కి పైగా (కిరాణా షాపుల ముసుగులో) బెల్ట్ షాపుల ద్వారా యదేచ్ఛగా బహిరంగంగా మద్యం అమ్మకాలు జోరుగా ఉదయం 4 గంటలనుండి అర్ధరాత్రి వరకు బడులు,గుడులు, గృహ సముదాయాలకు సంబంధం లేకుండా చీకటి వ్యాపారాలు కొనసాగుతున్నాయి.దీని వల్ల చిన్నారులు, మహిళలు బయటికి వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయని, అదేవిధంగా సమయంతో సంబంధం లేకుండా రోజూ వారి కూలీలు ఉదయం నుంచి బెల్ట్ షాపుల ద్వారా మద్యం తాగుతూ పనులకు వెళ్లకుండా మద్యం మత్తులో ఉండి కుటుంబ కలహాలతో, విచక్షణ కోల్పోయి అనేక దారుణాలు జరుగుతున్నాయని వాపోయారు.ఇప్పటికైనా వైన్స్ నిర్వాహకులు బెల్ట్ షాపులకు మద్యం అమ్మకాలు నిలిపివేయాలని లేకుంటే వైన్స్ ల ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.గతంలో బెల్ట్ షాపుల నియంత్రణకు ఎన్నో సార్లు వినతి పత్రాలు అందజేసి,హెచ్చరించినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించే తీరుపై పలు అనుమానాలకు తావిస్తుంది. మండల పరిధిలోని చిన్న చిన్న గ్రామాల్లో మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తున్న తరుణంలో మండల కేంద్రము లో సాధ్యం కాదా? అని తక్షణమే బెల్ట్ షాపులకు మద్యం అమ్మకుండా ఆపాలని వైన్స్ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు కావటంతో బెల్ట్ షాపుల నియంత్రణకు కృషి చేస్తుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ యువజన సంఘం సభ్యులు ,నరేందర్, రమేష్, శరత్, ప్రశాంత్, శ్రీకాంత్, యాదయ్య రమేష్, నరేందర్, శ్రీకాంత్, శివ కుమార్, రాజేశ్వర్, వెంకటేష్, హరీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు



# అవినీతి రహిత కోదాడగా తీర్చిదిద్దుతాం

- కోదాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- కోదాడకు సరికొత్త గుర్తింపు తీసుకొస్తాను

**కోదాడ,విశాలభారతి:** కోదాడ నియోజకవర్గాన్ని అవినీతి రహిత నియోజకవర్గంగా మారుస్తానని ఎక్కడ ఎవరికి అన్యాయం జరగకుండా చూస్తానని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అన్నారు. కోదాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ చరిత్రలో ఎన్నడు రాని మెజార్టీతో నన్ను గెలిపించినందుకు కోదాడ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అదే నమ్మకంతో కోదాడను అభివృద్ధి పథంలో నడుపుతానని అన్నారు. గత ఐదు సంవత్సరాలలో కోదాడ నియోజకవర్గం అవినీతిమయంలో, అరాచకాలతో, వివక్షతతో గత ఎమ్మెల్యే కొనసాగిందని వారన్నారు. నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులుగా నిలబడాలన్న వాళ్ళు ఏ పనులు చేయాలన్న గత ఎమ్మెల్యే అనుమతి లేకుండా ఏ పని గాని ఏ బిల్లు గాని ముందు సాగే పరిస్థితి లేదని ప్రజాప్రతినిధిగా నిలబడాలన్న అధికారులు కోదాడకు ట్రాన్స్ఫర్ కావాలన్నా తన వాటా ఇస్తేనే జరిగేవని అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోదాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎటువంటి అవినీతి అక్రమాలు జరగకుండా తను చూస్తానని కోదాడను అభివృద్ధి పథంలో ముందు కొనసాగిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తెలంగాణ ముఖ ద్వారంలో అరుదైన స్వాగత తోరణం ఏర్పాటు చేస్తానని అన్నారు. కోదాడ పటణంలో ఎవరు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని స్వేచ్ఛగా తమ పనులు చేసుకోవచ్చని అన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వేంపల్లి చందర్రావు, సీనియర్ నాయకులు పాండు రంగారావు, లక్ష్మీనారాయణ రెడ్డి, ఎర్నేని బాబు, వంగవీటి రామారావు, అల్తాఫ్ హుస్సేన్, నల్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మ వెంకన్న సేవలు మరువలేనివి

**చిగురుమామిడి,విశాలభారతి:** ఈ ప్రాంతానికి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బొమ్మ వెంకన్న చేసిన సేవలు మరువలేనివని చిగురుమామిడి మండలం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కంది శంకర్ అన్నారు. చిగురుమామిడి మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బొమ్మ వెంకన్న 82వ జయంతి వేడుకలను సోమవారం రోజున ఘనంగా నిర్వహించినారు. ఇందుర్తి గ్రామంలోని బొమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల మున్నూరు కాపు ప్రధాన కార్యదర్శి కానవేని శివకుమార్, సుందరగిరి సర్పంచ్ శ్రీమూర్తి రమేష్, మున్నూరు కాపు నాయకులు చింతపూలు అంజయ్య, బుద్ధార్తి మహేందర్, చింతపూల నాగయ్య, కూన



సంతోష్, చింతపూల నరేందర్, చింతపూల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.







# "మహాలక్ష్మి"లో దొంగలు పడ్డారు

- నకిలీ కార్డులు ముద్రించి సొమ్ము చేసుకుంటుండ్రు..
- ప్రభుత్వంను అప్రతిష్టపాలు చేయాలని చూస్తుండ్రు.
- నకిలీ కార్డుల దొంగల ఆట కట్టించాలంటున్న కాంగ్రెస్ శ్రేణులు.

**షాద్ నగర్ విశాలభారతి:**తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "మహాలక్ష్మి పథకం"లో దొంగలు పడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఆరు గ్యారెంటీల పథకానికి సంబంధించిన నకిలీ కార్డులు ముద్రించి కేటుగాళ్ళు తమ దోపిడీకి మార్గంగా ఎంచుకున్నారు.ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి.. ప్రతి నెలా నగదు చెల్లింపునకు.. గ్యాస్ సిలిండర్ ఇలా.. మహిళలకు అందించే పథకాలకు సంబంధించి..ప్రభుత్వం మహాలక్ష్మి అనే కార్డు జారీ చేయనుంది. దీన్ని క్యాష్ చేసుకునేందుకు అప్పుడే నకిలీరాయుళ్లు రంగంలోకి దిగేశారు.నకిలీ మహాలక్ష్మి కార్డులను ముద్రించి ఒక్కో కార్డును 100 రూపాయల నుంచి 250కి అమ్ముతున్నారు. ఈ కార్డు ఉంటేనే ఆర్టీసీ ఉచితంగా ప్రయాణిస్తారంటూ పల్లెల్లో మహిళలకు చెబుతూ కార్డును అమ్ముతూ వారిని బురిడీ కొట్టిస్తున్నారు.షాద్ నగర్ నియోజకవర్గంలో పింక్ కలర్ లో వున్న కార్డుపై కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు అని ఉంది. అదే విధంగా ఆర్టీసీ ఉచిత ప్రయాణం,, ప్రతినెలా 2 వేల 500, గ్యాస్ సిలిండర్ 500 రూపాయలు అని ముద్రించి ఉంది. ఈ కార్డుపై సోనియాగాంధీ పేరుతో సంతకం కూడా క్రియేట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గుర్తు, సోనియాగాంధీ ఫోటోలు ఉన్నాయి.కార్డుకు రెండో వైపు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఫోటోతో పాటు చేయి గుర్తు ఆ పక్కనే క్యూ ఆర్ కోడ్ కూడా పెట్టారు.ఎవరెవరికి కార్డు కావాలో వారి పేరుతో ఈ కార్డులు ముద్రించి ఒక్కొక్కటి 100 రూపాయల నుంచి 250 వరకు అమ్ముతున్నారు కేటుగాళ్లు.అసలు ఇప్పటి వరకు ప్రభుత్వం ఎవరికీ ఎలాంటి కార్డులు అధికారికంగా జారీ చేయలేదని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.ప్రభుత్వంను అప్రతిష్టపాలు చేయాలని చూస్తుండ్రని గ్రామాల్లో కనిపిస్తున్న మహాలక్ష్మి కార్డులు అన్నీ నకిలీవి అని ఎవరూ నమ్మొద్దని, ఎవరో కొందరు ఇలాంటి తప్పుడు కార్డులను పంపిణీ చేస్తున్నారని, ఇలాంటి ప్రయత్నాల వల్ల ప్రభుత్వంను అభాసుపాలు చేసేందుకు కొందరు ఆడుతున్న నాటకమని ఇవి ప్రజలు విశ్వసించరని,నకిలీ కార్డుల దొంగల ఆట కట్టించాలని కాంగ్రెస్ శ్రేణులు పోలీసులను కోరుతున్నాయి.



# కవితా దుందుభిని విజయవంతం చేయండి

## ఓయూ సాహిత్య వేదిక

**సికింద్రాబాద్, విశాలభారతి:** ఓయూ సాహిత్య వేదిక ఆరవ వార్షికోత్సవం సందర్భంగా డిసెంబర్ 14 మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతున్న " కవితా దుందుభి" కార్యక్రమానికి విద్యార్థులు, పరిశోధకులు, సాహిత్యాభిలాషులు హాజరై విజయవంతం చేయాలని ఓయు ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపల్ ప్రో,చింతా గణేష్, తెలుగు శాఖ అధ్యక్షులు ప్రో. చింతకింది కాశీం కోరారు. ఓయూ సాహిత్య వేదిక కవితా దుందుభి కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణలో బాగంగా పాల్గొన్న ప్రో. చింతా గణేష్ మాట్లాడుతూ ఓయూలో సాహిత్య విలువలను పెంపొందించే ఇట్లాంటి కార్యక్రమాలు ఇంకా ఎన్నో జరగాలని, వాటికి ఆర్ట్స్ కాలేజీ నుండి పూర్తి సహకారం ఉంటుంది అని చెప్పారు. ప్రో. చింతకింది కాశీం మాట్లాడుతూ ఓయూలో సాహిత్య చర్చల కోసం 2017లో పరిశోధక విద్యార్థులు నిర్మాణం చేసిన ఓయూ సాహిత్య వేదిక అనే సంస్థ చేస్తున్న కవితా దుందుభి కార్యక్రమానికి అందరూ హాజరై కవితా గానాన్ని వినాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ సాహిత్య వేదిక కార్యవర్గ సభ్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పళని కన్వెన్షన్ లో మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ద్వితీయ కుమార్తె శారీ ఫంక్షన్ లో మేడిపల్లి సీఐ సైదులు ఎస్సై కృష్ణ బండి యాదగిరి తల్కా శత్రుజ్ఞ పాల్గొని ఆశీర్వదించారు.



# రాష్ట్రం ఏర్పడిన ఫలాలు దక్కలే..

- మళ్లీ ఆంధ్ర ప్రాంత కులాలను కలిపితే తీవ్ర అన్యాయమే..
- ఉద్యమ జేఏసీ చైర్మన్ కోదండరాం ను కలిసిన బీసీ ఏ గ్రూప్ ప్రతినిధులు.

**ముషీరాబాద్,విశాల భారతి:** తెలంగాణ కోసం జేఏసీ పిలుపుమేరకు తెగించి కొట్లాడితే రాష్ట్ర ఏర్పడిందే తప్ప ప్రభుత్వ పథకాలు దక్కలేదని తెలంగాణ రాష్ట్ర బీసీ ఏ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ బాగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో బాగుపడలే కనీసం స్వరాష్ట్రంలో బతుకులు మారుతాయి అనుకుంటే ఇంకా దిగజారి పోయామన్నారు. ఈ మేరకు సోమవారం నాంపల్లి లోని తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో ఉద్యమ నేత పార్టీ అధ్యక్షులు కోదండరాం ను పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ నరహరి, భాగయ్య కలిశారు. తెలంగాణలో తొలగించిన ఆంధ్ర ప్రాంతానికి చెందిన 27 కులాలను మళ్లీ ఆ జాబితాను తిరిగి బీసీ ఏ గ్రూపులో చేర్చాలని ప్రయత్నాలు చేస్తున్నారని కోదండరాం కు వివరించారు. ఇది జరిగితే అత్యంత దారిద్ర రేఖకు దిగువన ఉన్న కులాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రొఫెసర్ బాగయ్య, ఎమ్మెస్ నరహరి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం తో పాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఏ గ్రూప్లో ఉన్న కులాలు అత్యంత నెగ్లెట్ కాబడ్డాయని, దీనితో ఆ కులాలు అత్యంత వెనుకబడి దౌర్భాగ్య స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఈ కులాలను పట్టించుకున్న పాపాన పోలేదని, ప్రభుత్వ ఫలాలు వీరికి అందని ద్రాక్షగా మిగిలిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇదే తరుణంలో ములిగే నక్క మీద గుడ్డు పడినట్టు ఆంధ్ర కు చెందిన బిసి 27 కులాలను మళ్లీ తెచ్చి తెలంగాణలో చేర్చితే ఈ కులాలు మరింత దిగజారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మరోపక్క ఆర్ కృష్ణయ్య ఆంధ్ర రాష్ట్రానికి చెందిన పదవిలో ఉంటూ ఆ కులాలను తెలంగాణలో కలపాలంటూ మాట్లాడడం ప్రయత్నాలు చేయడం తగదన్నారు. బీసీ నేతగా ఉన్న మీకు వీరి స్థితిగతులు తెలువావా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత మినిస్టర్స్ ఎట్టి పరిస్థితుల్లో తొలగించిన ఈ కులాలను చేర్చొద్దని కోరారు. మాకు జరుగుతున్న అన్యాయాలపై కోదండరాం దృష్టికి తీసుకెళ్లామని ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు.



# అధికారులు స్వేచ్ఛగా పనిచేసుకోండి


- ప్రజలకు సేవలు అందించడంలో ఇబ్బందులు రానీయకండి.
- ఉద్యోగస్తులకు అండగా ఉంటా.
- పంచాయతీరాజ్ శాఖ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

**షాద్ నగర్,విశాలభారతి:** గత ప్రభుత్వ హయాంలో అధికారులు ఎన్ని ఇబ్బందులకు గురయ్యారో తమ కళ్లారా చూసామని ప్రజలు మెచ్చిన ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అధికారులు ఇక మీరు స్వేచ్ఛగా పనిచేసుకోవచ్చని కాని ప్రజలకు సేవలు అందించడంలో మాత్రం ఇబ్బందులు రానీయవద్దని షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" అన్నారు.షాద్ నగర్ డివిజన్ పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించిన సమీక్ష సమావేశాన్ని సోమవారం ఫరూక్ నగర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖా ఈఈ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో ఫరుక్ నగర్, కొత్తూరు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాలకు చెందిన ఏఈలు తదితర అధికారులు హాజరయ్యారు. వీరిని ఉద్దేశించి ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రజలు మెచ్చిన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ప్రజలకు కావలసిన సౌకర్యాలను, కనీస వనరులను సమకూర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ఉద్యోగస్తులను తాము ఎలాంటి ఇబ్బందులకు గురి చేయమని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు ఉండబోవని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేపడుతుందని స్పష్టం చేశారు. అధికారులు తగిన సూచనలు సలహాలతో ఎల్లవేళలా ప్రభుత్వానికి అందుబాటులో ఉండాలని, అభివృద్ధి పనుల విషయంలో పూర్తి మెలకువలు పాటించాలని కోరారు. సాంకేతిక కారణాలతో ఏవైనా పనులు నిలిచిపోతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని పనుల విషయంలో అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఎల్లవేళలా ఉద్యోగస్తులకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

**ఎమ్మెల్యేను సన్మానించిన అధికారులు.**

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ ను సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పలువురు అధికారులు ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎంపికైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ఎంపీడీవోలు శరత్ చంద్రబాబు,వినయ్ కుమార్ అదేవిధంగా ఎంపీపీ ఖాజా అహ్మద్ ఇద్రిస్, జెడ్పిటిసిలు పి.వెంకట్రాం రెడ్డి,విశాలశ్రావణ్ రెడ్డి అదేవిధంగా కొత్తూరు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితర పంచాయతీరాజ్ శాఖ అధికారులతో పాటు ఆయా గ్రామాల సెక్రటరీలు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేశంపేట ఎస్సై వరప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, పి రఘు, బాలరాజ్ గౌడ్, సురేష్ రెడ్డి, సిపిఐ నాయకుడు శ్రీను నాయక్, సయ్యద్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.





# నేలను చూస్తున్న నిఘానేత్రాలు

## పర్యవేక్షణలోపంతో అలంకార ప్రాయంగా మారిన వైనం

**కొత్తూరు,విశాలభారతి:** ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమంటూ చెప్తుంటారు. కానీ ఇక్కడ ఆ నిఘా నేత్రాలు పర్యవేక్షణ లేక నిద్రిస్తున్నాయి.మండలంలోని చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదు.ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పర్యవేక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వివరాలలోకి వెళితే ప్రజల, ప్రజాప్రతినిధుల సహకారంతో నేరాల నియంత్రణ కోసం పోలీసు యంత్రాంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నందిగామ, కొత్తూరు మండలాలలోని పలు గ్రామాల్లో అవి పనిచేయక పోవడంతో అలంకారప్రాయంగా మిగిలాయి.దీన్ని చూసిన ప్రజలు సీసీ కెమెరాలు ఉన్న లేనట్టేనని, నిఘా నేత్రాలు నిద్రిస్తున్నవని చర్చించుకుంటున్నారు. ప్రస్తుత రోజుల్లో సీసీ కెమెరా ప్రాధాన్యత ప్రతి ఒక్కరికి తెలిసిందే. ప్రతి ఇంటి ముందు సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవడంతో పాటు గ్రామాల్లో అయితే ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసుకుంటున్నారు. నేరాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గతంలోనే సుప్రీంకోర్టు సూచించింది. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన ముందుగా వెతికేది సీసీ కెమెరా ఫుటేజ్ నే అనేది తెలిసిందే. అయితే ఇంతటి ప్రాధాన్యత కలిగిన సీసీ కెమెరాల పని తనం అలంకరణ ప్రాయంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మండలపరిధిలోని కొన్ని గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ పర్యవేక్షణ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీ కెమెరాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడంతో పలుచోట్ల కెమెరాలు మసకబారుతున్నాయని ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామపంచాయతీల పరిధిలో అయితే సీసీ కెమెరాల ఏర్పాటు కూడా లేకపోవడం గమనార్హం.ఇప్పటికైనా పట్టించుకొని సీసీ కెమెరాలను పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.




# అడివి శేష్ 'G2' షూటింగ్ ప్రారంభం

అడివి శేష్ 'G2' ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచే ఈ చిత్రంపై అంచనాలు పెరిగాయి. సినిమా స్కేల్ మరింత పెద్దదిగా కనిపిస్తోంది. బనితా సంధు హీరోయిన్ గా నటిస్తున్న యాక్షన్ స్పై థ్రిల్లర్ ఇప్పుడు సెట్స్ పైకి వెళ్ళింది. G2 షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. మొదటి దశ నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ కోసం హైదరాబాద్‌లో 5 అంతస్తుల లావిష్ గ్లాస్ సెట్‌ను నిర్మించారు. క్రిస్ప్ సూట్ ధరించిన అడివి శేష్ అందరిని ఆకట్టుకున్నారు. 'G2' స్పై థ్రిల్లర్, ఇది సక్సెస్ ఫుల్ గూఢచారి ఫ్రాంచైజీలో నెక్స్ట్ ఇన్స్టాల్మెంట్. తన దేశం కోసం పోరాడటానికి ఇండియా వెలుపల మిషన్‌లో ఉన్న గూఢచారి కథ ఇది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ , ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్నారు.



# స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ 'ఎస్వీసీసీ 37' షూట్ ప్రారంభం

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ మల్టీటాలెంటెడ్ అన్న సంగతి తెలిసిందే. హీరోగా, స్క్రీన్ రైటర్‌గా, కో ఎడిటర్‌గా, క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా పలు విభాగాల్లో తన సత్తాను చాటుకుంటూ ఉన్నారు. డీజే టిల్లు సినిమాతో తిరుగులేని బ్లాక్ బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఎంతో సెలెక్టివ్‌గా సినిమా కథలను ఎంచుకుంటున్నారు. తాజాగా ఈ హీరో బొమ్మరిల్లు భాస్కర్‌తో చేతులు కలిపారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్ మీద నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి వర్కింగ్ టైటిల్‌గా SVCC 37 అని ఫిక్స్ చేశారు. రీసెంట్‌గా ఈ సినిమా పూజా కార్యక్రమాలు జరిగిన సంగతి తెలిసిందే. నేడు ఈ మూవీ షూటింగ్ ప్రారంభం కానుందని ఓ స్ట్రైకింగ్ పోస్టర్‌తో అప్డేట్ ఇచ్చారు. ఈ పోస్టర్‌లో బొమ్మరిల్లు భాస్కర్, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్, హీరో సిద్ధు కనిపిస్తున్నారు. మోస్ట్ ఎలిజబుల్ బ్యాచ్‌లర్ వంటి సూపర్ హిట్‌తో బొమ్మరిల్లు భాస్కర్ మళ్లీ అందరినీ ఆకట్టుకున్నారు. అలాంటి డైరెక్టర్‌తో.. యూత్ సెన్సేషన్ సిద్ధు సినిమా చేస్తున్నాడని తెలియడంతోనే అంచనాలు పెరిగాయి. వీరిద్దరి కాంబోలో రాబోతోన్న ఈ చిత్రం కచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని అంతా భావిస్తున్నారు.



# హ్యాపీ బర్త్ డే నభా నటేశ్

ఆకర్షించే గ్లామర్, ఆకట్టుకునే నటనతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి పేరు తెచ్చుకుంది హీరోయిన్ నభా నటేష్. "నన్ను దోచుకుందువటే", "ఇస్మార్ట్ శంకర్", "సోలో బ్రతుకే సో బెటర్", "డిస్కో రాజా", "అల్లుడు అదుర్స్", "మాస్ట్రో" వంటి చిత్రాల్లో విభిన్నమైన క్యారెక్టర్స్ లో నటించి ఆకట్టుకుంది నభా. సినిమాల బాక్సాఫీస్ రిజల్ట్ తో సంబంధం లేకుండా హీరోయిన్ గా క్రేజ్ తెచ్చుకుంది. సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉండే ఈ హీరోయిన్ ఎప్పటికప్పుడు ఫోటో షూట్స్ చేస్తూ ఫాలోవర్స్ ని ఇంప్రెస్ చేస్తుంటుంది. భుజం గాయం కారణంగా సినిమాల నుంచి చిన్న బ్రేక్ తీసుకుంది నభా నటేష్. త్వరలో ఆమె కొన్ని ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేయబోతోంది. ఇవాళ నభా నటేష్ బర్త్ డే. సోషల్ మీడియాలో నభాకు విశెస్ చెబుతూ పోస్టులు చేస్తున్నారు ఆమె ఫ్యాన్స్, ఫాలోవర్స్. ఆమె మళ్లీ తెలుగు తెరపై సందడి చేయాలని వారంతా కోరుకుంటున్నారు.

# భూకంపం పుట్టించిన సమంత

తనదైన అందం నటనతో పాన్ ఇండియా స్థాయిలో ఆకర్షిస్తోంది సమంత రూత్ ప్రభు. బాలీవుడ్ టాలీవుడ్ సహా అన్నిచోట్లా భారీ క్రేజ్ ఉన్న స్టార్ గా వెలిగిపోతోంది. ప్రియాంక చోప్రా నటించిన సిటాడెల్ ఇండియా వెర్షన్ లో నటించిన ఘనత సమంతకే సొంతమైంది. తదుపరి బాలీవుడ్ లో బిగ్ కెరీర్ ఆశిస్తున్న సమంత ఫోటోషూట్ల పరంగా అగ్గి రాజేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా సమంత ఎర్త్ బ్రేకింగ్ ఫోటోషూట్ వెబ్ లో అగ్గి రాజేస్తోంది. ప్రఖ్యాత ఎంటీవీ హజిల్ కోసం ఫోటోషూట్ ఇదని సమంత స్వయంగా వెల్లడించింది ఇన్ స్టాలో. ఇక ఈ డిజైనర్ డెనిమ్ లుక్ ఇంప్రెస్సివ్ అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా సమంత కిల్లర్ ఫోజులు కుర్రకారు గుండెల్లో గుబులు పెంచుతున్నాయి. డెనిమ్ టాప్ డెనిమ్ ఫ్యాంట్ లో కని పించిన సమంత.. తన ఫ్యాంట్ కి దాదాపు రెండు డజన్ల పిన్నీసులు ధరించడం కనిపించింది. ఇది నిజంగా ఆశ్చర్యం కలిగించే డిజైనర్ లుక్. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. సమంత సోషల్ మీడియా ప్రచారంలో మాత్రమే కాకుండా తన దుస్తుల బ్రాండ్ సాకి తో పాటు ఏకమ్ ప్రీస్కూల్ బిజినెస్ వంటి వ్యాపారాలలోను బిజీగా ఉంది. 'ఆహా'లో సామ్ జామ్ వంటి షోలు చేస్తూ కొన్ని ఇంటర్వ్యూలను చేస్తోంది. ఇప్పుడు సామ్ కొత్త జాబ్ చర్చగా మారింది. ఒక పాపులర్ రియాలిటీ షోకు సమంత న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తోంది. రియాలిటీ షో MTV హజిల్ తదుపరి ఎపిసోడ్‌లో సమంత కనిపించనుంది. కార్యక్రమంలో న్యాయనిర్ణేతగా ఉన్న పాప్ స్టార్ బాద్‌షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో సమంత ఫోటోలను షేర్ చేశారు. ఈ జోడీ వేదికపై నవ్వుతూ నృత్యం చేస్తూ కనిపిస్తారు.



# డిసెంబర్ 15న రానున్న 'పిండం'



ప్రముఖ హీరో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా డిసెంబర్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం నాడు ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ ను నిర్వహించిన చిత్ర బృందం సినిమా విశేషాలను పంచుకున్నారు. కథానాయకుడు శ్రీరామ్ మాట్లాడుతూ.. "పిండం సినిమా ఏంటి అనేది మీకు డిసెంబర్ 15న తెలుస్తుంది. ఈ సినిమాని థియేటర్ లో చూడటానికి నేను కూడా ఎంతగానో ఎదురుచూస్తున్నాను. ఈ చిత్రం మీకు ఖచ్చితంగా నచ్చుతుంది. మీరందరూ మా సినిమాని చూసి ఆదరిస్తారని నమ్ముతున్నాను." అన్నారు. కథానాయిక ఖుషి రవి మాట్లాడుతూ.. "నేను ఎప్పుడూ మంచి నటులు, మంచి దర్శకులు, మంచి నిర్మాణ సంస్థ, మంచి సాంకేతిక నిపుణులతో కలిసి పని చేయాలని కోరుకుంటాను. ఈ సినిమాతో నా కోరిక నెరవేరింది. నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు ధన్యవాదాలు. తోటి నటీనటులు, సాంకేతిక నిపుణులు నాకు ఎంతో సపోర్ట్ చేశారు. డిసెంబర్ 15న విడుదలవుతున్న మా చిత్రాన్ని థియేటర్లలో చూసి ఆదరిస్తారని కోరుకుంటున్నాను." అన్నారు. దర్శకుడు సాయికిరణ్ దైదా మాట్లాడుతూ.. "నల్గొండ జిల్లాలో జరిగిన ఒక యదార్థ ఘటనను తీసుకొని, దాని చుట్టూ కల్పిత కథ అల్లుకొని, దీనిని హారర్ జానర్ లో చెప్తే బాగుంటుంది అనే ఆలోచనతో పిండం కథను రాసుకున్నాము. హారర్ జానర్ ని ఇష్టపడే ప్రేక్షకులు భయాన్ని ఆశించి సినిమాకి వస్తారు. భయం ఎంత బాగా పండితే, సినిమా అంత బాగా ప్రేక్షకులను కనెక్ట్ అవుతుంది. దానిని దృష్టిలో పెట్టుకొని ఎంతో శ్రద్ధతో ఈ స్క్రిప్ట్ ని రాసుకోవడం జరిగింది. ప్రీ ప్రొడక్షన్ కోసం పెద్ద సినిమాల కంటే ఎక్కువ సమయాన్ని కేటాయించి, పక్క ప్లానింగ్ తో సినిమాని చిత్రీకరించాం. ప్రేక్షకులు ఖచ్చితంగా ఈ సినిమా చూసి భయపడతారు. ఒక మంచి స్క్రిప్ట్, ఒక మంచి సినిమాని తీసుకొస్తుంది. అలాంటి బలమైన కథతో వస్తున్నదే మా పిండం చిత్రం. మీడియా మిత్రులు కూడా ఇలాంటి మంచి సినిమాలకు అండగా నిలిచి, ప్రేక్షకులకు మరింత చేరువయ్యేలా చేస్తారని కోరుకుంటున్నాను." అన్నారు. నిర్మాత యశ్వంత్ దగ్గుమాటి మాట్లాడుతూ.. "ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుంది. డిసెంబర్ 15న మా పిండం సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలవుతుంది. ప్రేక్షకులు మా సినిమాను చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను." అన్నారు. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి మాట్లాడుతూ.. "నాకు ఇంత మంచి అవకాశాన్ని ఇచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. థియేటర్లలో మీరు ఈ సినిమా చూసేటప్పుడు ఖచ్చితంగా ఓ అనుభూతిని పొందుతారు. ఇందులో హారర్ తో పాటు మిగతా ఎలిమెంట్స్ కూడా ప్రేక్షకులను అలరిస్తాయి. ఇది మూడు విభిన్న కలల్లో జరిగే కథ. సాయికిరణ్ దైదా చాలా స్పష్టత ఉన్న దర్శకుడు. సినిమాని అద్భుతంగా రూపొందించారు." అన్నారు.

# కల్ట్ బొమ్మ అనే టైటిల్ ను రిజిస్టర్ చేయించిన ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్

బేబి సినిమాతో టాలీవుడ్ కు కల్ట్ బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చారు ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ లో ఆయన ఇంట్రెస్టింగ్ లైనప్ తో క్రేజీ ప్రాజెక్ట్స్ నిర్మించబోతున్నారు. తాజాగా ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ కల్ట్ బొమ్మ అనే టైటిల్ ను రిజిస్టర్ చేయించారు. ప్రస్తుతం ఆయన మల్టీపుల్ ప్రాజెక్ట్స్ నిర్మిస్తున్నారు. వాటిలో రశ్మిక మందన్న లీడ్ రోల్ మూవీకి ది గర్ల్ ఫ్రెండ్ టైటిల్ అనౌన్స్ చేశారు. సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా ఓ సినిమా, ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య హీరో హీరోయిన్లుగా మరో సినిమా ప్రొడక్షన్ లో ఉంది. మరి ఈ కల్ట్ బొమ్మ అనే టైటిల్ ఏ సినిమాకు పెట్టబోతున్నారు అనేది ఆసక్తికరంగా మారింది. ఇవి రెండు కాకుండా కల్ట్ బొమ్మ టైటిల్ తో మరేదైనా కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేస్తారా అనేది చూడాలి. ఏమైనా బేబి ప్రమోషన్ లో కల్ట్ బ్లాక్ బస్టర్, కల్ట్ బొమ్మ అనే పదాన్ని తన స్పీచుల్లో ఎస్ కే ఎన్ బాగా వాడి, ఆ పదాలను పాపులర్ చేశారు. ఈసారి అదే టైటిల్ తో సినిమా చేస్తుండటం ఇంట్రెస్టింగ్ గా ఉంది.



# బూట్ కట్ బాలరాజు పెద్ద విజయాన్ని సాధించాలి

: బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి

బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి లాంచ్ చేసిన సోహెల్, శ్రీ కోనేటి, ఎం.డీ పాషా 'బూట్ కట్ బాలరాజు' హిలేరియస్ టీజర్ 'బిగ్‌బాస్' ఫేమ్ సోహెల్ టైటిల్ రోల్ లో శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్ & కథ వేరుంటాది బ్యానర్స్ పై ఎం.డీ పాషా నిర్మిస్తున్న చిత్రం బూట్ కట్ బాలరాజు. మేఘ లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి 'బూట్ కట్ బాలరాజు' టీజర్ ని లాంచ్ చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్ లో బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. బూట్ కట్ బాలరాజు టీం అందరికీ నా బెస్ట్ విషెస్. సోహెల్ నాకు బిగ్ బాస్ అప్పటినుంచి బాగా తెలుసు. తను ప్రతి సినిమాకి చాలా హార్డ్ వర్క్ చేస్తున్నారు. ఈ సినిమాతో తనకి మంచి సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను. ఇంద్రజ గారు ఇటు టీవీ, అటు సినిమా రెండిటిలో అలరిస్తున్నారు. ఈ సినిమా స్క్రిప్ట్ ని డెవలప్ చేసిన బెక్కం వేణుగోపాల్ గారికి, రచయితలు, ఇందులో నటించిన నటీనటులందరికీ ఆల్ ది బెస్ట్. దర్శకుడు శ్రీ కోనేటి చేస్తున్న రెండో సినిమా ఇది. సినిమా చాలా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను. టీం అందరికీ మీ ప్రోత్సాహం కావాలి'' అని కోరారు. దర్శకుడు శ్రీ కోనేటి మాట్లాడుతూ.. అందరూ ఎంజాయ్ చేసే సినిమా ఇది. ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి కారణం, ఈ సినిమా వెన్నుముక బెక్కం వేణు గోపాల్ గారు. తర్వాత నిర్మాత పాషా గారు. ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. అలాగే నిర్మాత మీదవున్న భారాన్ని సోహెల్ తన మీదకు తీసుకొని నడిపించారు. రాకేశ్, రామ్ ప్రసాద్ మంచి మాటలు రాశారు. మా టెక్నికల్ టీం ఎంత గానో సపోర్ట్ చేశారు. ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా వుంటుంది' అన్నారు నిర్మాత పాషా మాట్లాడుతూ.. ఈ సినిమా చేయడానికి కారణం నా స్నేహితుడు సోహెల్. ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఒసేయ్ రాములమ్మలో విజయశాంతి గారిని ఎలా చూశారో.. ఇందులో ఇంద్రజ గారిని అలా చూస్తారు. దర్శకుడు శ్రీ కోనేటి చాలా ప్రతిభవంతుడు. ఈ సినిమా తప్పకుండా పెద్దవిజయం సాధిస్తుందనే నమ్మకం వుంది. నా తొలి చిత్రమిది. ప్రేక్షకుల అందరూ తప్పకుండా సపోర్ట్ చేసి మరిన్ని సినిమాలు చేసే అవకాశం కల్పించాలని కోరుకుంటున్నాను.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.